# మిసిమి

(మాస పత్రిక)

## ఆచార్య నాగార్జునుడు



నవంబర్ 1990 రు.2/-

# మిసిమి

(మాస పత్రిక)

సంపుటి 1 నవంబర్ 1990 సంచిక 16


విషయసూచిక


కుబేరుల–క్లబ్

యుగ యుగాలుగా

భావప్రపంచాన్ని ఉర్రూతలూపుతున్న

ఆచార్య నాగార్జునుడు

(విగ్రహ వ్యావర్తని నుండి) డా॥ జి.వి. కృష్ణారావు

మాతృదేవోభవ వాస్తవగాథ

ఆనందం పరబ్రహ్మేతి యోనిహి

ప్రొ. కె. శేషాద్రి — విష్ణు సహస్రనామం

సంక్షుభిత నైతికవాది మొరావియా

— అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

మేధావిగా సంజీవదేవ్

— డా॥ ఎన్. ఇన్నయ్య

# కుబేరుల - క్లబ్

## దేశంలో మొదటి 20 మంది (వెం) కోటీశ్వర స్వాములు

(అంకెలు కోట్ల రూపాయలలో)

| కంపెనీలు | Sales 1989-90 | Rank 1988-89 | Sales 1988-89 |
|---|---|---|---|
| 1. టాటాలు | 10094.16 | 1 | 8413.42 |
| 2. బికె-ఎ.వి. బిర్లా | 4433.30 | 2 | 3121.42 |
| 3. అంబాని | 2917.26 | 3 | 2018.58 |
| 4. బజాజ్ | 2047.02 | 5 | 1642.10 |
| 5. ఆర్పిజి ఎంటర్ప్రైజెస్ | 1937.00 | 4 | 1703.12 |
| 6. టాపర్ | 1724.16 | 6 | 1571.81 |
| 7. చెబ్రియా | 1502.94 | 8 | 1160.23 |
| 8. మల్లయ్య | 1495.00 | 12 | 1049.83 |
| 9. జి.యమ్. మోడి | 1439.67 | 10 | 1112.58 |
| 10. జిపి-సికె బిర్లా | 1421.81 | 7 | 1240.76 |
| 11. మహేంద్ర | 1311.93 | 13 | 1036.81 |
| 12. మఫత్ లాల్ | 1177.04 | 11 | 1059.74 |
| 13. నందా | 1012.10 | 15 | 820.25 |
| 14. కె.కె. బిర్లా | 958.73 | 19 | 728.00 |
| 15. గోద్రెజ్ | 952.00 | 16 | 775.00 |
| 16. జెకె నార్త్ | 882.23 | 14 | 879.57 |
| 17. కిర్లోస్కర్ | 862.24 | 18 | 748.22 |
| 18. వాల్ చంద్ | 846.86 | 17 | 760.10 |
| 19. యంపి బిర్లా | 800.00 | | |
| 20. హిందుజ | 753.35 | | |

గమనిక: (ఆంధ్రప్రదేశ్ వార్షిక ఆదాయం రూ.6000 కోట్లు)

యుగ యుగాలుగా
భావప్రపంచాన్ని
ఉర్రూతలూపుతున్న

# ఆచార్య నాగార్జునుడు

డా॥ జి.వి. కృష్ణారావు

వర్ణ సమామ్నాయంలో ఁ కారానికి ఉన్న స్థానమే భారతదేశ చరిత్రలో ఆంధ్రుల కున్నట్లు నేడు వెలువడుతున్న చరిత్ర గ్రంథాలనుబట్టి ఊహించవలసి వస్తున్నది. కాని ప్రపంచసంస్కృతికీ, భారత తత్త్వశాస్త్రానికి ఆంధ్రులుచేసిన సేవ, యిచ్చిన దోహదం అనల్పం; అవిస్మరణీయం. ప్రపంచ సాహిత్య వనవాటిలో బృహత్కథా గాథా సప్తశతులు దివ్య పారిజాతాలు. తత్త్వ క్షేత్రంలో ఆర్య నాగార్జునుడు, ఆర్యదేవుడు, భావవివేకుడు, దిఙ్నాగుడు, ధర్మకీర్తి విత్తిపెంచి ప్రోదిచేసిన బోధివృక్షాల అంట్లే ప్రవృద్ధాలై టిబెట్, మంగోలియా, చైనా, జపాను దేశాలలోని జిజ్ఞాసువులకు జ్ఞానమూలికలు ప్రసాదించాయి. ఆర్ష దర్శనాభినివిష్టులకు వాత్స్యాయన భాష్యం, కుమారిలుని వార్తికాలు అమూల్యాలు. ఇలా సంస్కృతికీ, విచారధారకు దోహదమిచ్చిన వారిపేర్లు ఎన్నయినా చెప్పవచ్చును. కాని తమజాతి కీర్తి ప్రతిష్ఠలను నిలబెట్టిన మహాపురుషుల పుస్తకాల పేర్లుగాని, వారి సిద్ధాంతాలుగాని, ప్రపంచ చరిత్రలో వానికున్న స్థానంగాని, ఆంధ్రులైనా గ్రహించకపోవటం శోచనీయం.

ఉదాహరణకు ఆర్యనాగార్జునుని విషయమే తీసుకోవచ్చు. ఆంధ్ర ప్రజానీకానికి నాగార్జునకొండ ఎక్కడున్నదో అచట దొరుకుతున్న శిథిలావశేషాలు ఎట్టివో తెలుసు. కాని ఆ ప్రదేశానికి ప్రఖ్యాతి చేకూర్చిన మహనీయుని చరిత్రకాని, కృతులు కాని, అతని భావాల విలువకాని, తత్ప్రబుద్ధ దేశనామాలుగాని, తత్ప్రతిపాదిత నవ్యప్రపంచ సమస్యా పరిష్కార మార్గాలుగాని ఆంధ్రులకు తెలియవు. తెలిసి ఉన్నట్లయితే ప్రకృతం నాగార్జునసాగరమన్న పేరుతో సాగుతున్న ప్రాజెక్టుకు 'నందికొండ ప్రాజెక్టు' అనుపేరు పెట్టాలన్న ఊహయినా మొదట్లో కలిగిఉండేది కాదు.

సంఖ్యకు భారతదేశంలో దర్శనాలు అనేకాలు బయలు దేరినా నిశితంగా పరామర్శించి చూస్తే నిలిచే దర్శనాలు మూడే. ఒకటి మాధ్యమికవాదం, రెండు విజ్ఞానవాదం, మూడు అద్వైత వాదం. మొదటి వాదానికి నాందీకారుడు కాకపోయినా శాస్త్రీయరూపం నిబంధించిన వాడు ఆచార్య నాగార్జునుడే. దానిని విశదీకరించినవారు ఆర్యదేవుడు, బుద్ధపాలతుడు, చంద్రకీర్తి, శాంతిదేవుడు యూరప్‌లో కాంట్ పరతత్త్వ వాదం ఆవిర్భవించి జర్మనీని విచారధారతో స్నిగ్ధంచేసి వివిధ తాత్త్విక భావాలను మోసు లెత్తించింది. అలాగే మాధ్యమిక వాదంకూడ భారతదేశంలో జిజ్ఞాసను రేకెత్తించి అనేక వాదాలకు జీవం పోసింది. స్వతంత్ర మాధ్యమిక వాదం, విజ్ఞానవాదం, మాధ్యమిక యోగాచారం, సౌత్రాంతిక యోగాచారం, అద్వైతం మున్నుగాగల వాదాలన్నీ మాధ్యమిక వాదంనుంచి సాక్షాత్తుగా ఉత్పన్నం కాకపోయినా దాని ప్రభావం అంతో యింతో ఉన్నదనే చెప్పాలి.

అంతేగాదు. నాగార్జునుడు తొలిసారిగా తన ప్రతిభా విశేషంతో సాపేక్షతా వాదాన్ని క్రీ.శ. 1వ శతాబ్దిలోనే సాకల్యంగా ప్రతిపాదించి 20వ శతాబ్దిలోని ఐన్‌స్టీన్‌ను ముందుగానే ఊహించగలిగాడు. ప్రపంచం ఒక భావమని ప్రతిపాదించిన హెగెల్ సిద్ధాంతాన్ని సవిశేషంగా కాకపోయినా స్థూలంగానైనా ఊహించి యీతడు ఖండించాడు.

రెండోదయిన విజ్ఞానవాదానికి సుస్థిర స్వరూపం సంపాదించినవారు దిఙ్నాగుడు, ధర్మకీర్తి. వీరి తర్కధాటికి ప్రాచీనన్యాయం బీటలువారి నవ్యరూపం సంతరించింది.

ఈ రెండు దర్శనాలను మొత్తంమీద వ్యవస్థాపించినవారు ఆంధ్రులు. కాని వారిని యీనాడు సగర్వంగా స్మరించే ఆంధ్రులు ఎందరున్నారు? అసలు వారి వాదాలు తెలిసిన వారుకూడ స్వల్ప సంఖ్యాకులే. భాష్యానికి వివరణమో, భాషానువాదమో వ్రాసిన ఫలాని వాడు మా ఆంధ్రుడని సగర్వంగా చెప్పుకొంటున్నాంగాని స్వతంత్ర సిద్ధాంతంతో ప్రపంచానికి వెలుగుబాటలు చూపి జాతి వర్ణ భేదాలతో నిమిత్తంలేని సామాజిక వ్యవస్థకై పాటుపడిన మహామహుల పేర్లనైన స్మరింపలేక పోతున్నాము.

ఈ స్థితి అత్యంత శోచనీయం. ఏ జాతి అయినా, ఏ దేశమైనా తన ప్రాచీన చరిత్రను, సంస్కృతిని తెలియక వర్తమానాన్ని అర్థంచేసుకోలేదు. భవితవ్యాన్ని నిర్ణయించుకో జాలదు. అందువలన ఆంధ్రదేశ చరిత్రలో భారత సంస్కృతి ఇతివృత్తంలో, మానవ తత్త్వాన్వేషణలో విస్మారితమైన ఒక ఘట్టం యిట క్లుప్తంగా దిఙ్మాత్రంగా ప్రదర్శిత మౌతుంది.

మాధ్యమికవాద స్థాపనాచార్యుడు ఆర్య నాగార్జునుడు. ఇతని జీవితచరిత్ర ముందుగా పరిశీలించాలి.

భారతదేశ చరిత్రలో మహా పురుషుల కృతులు తెలిసినంతగా వారి జీవిత విశేషాలు తెలియవు. దీనికి కొలది అపవాదులుంటే ఉండవచ్చు. కాని మొత్తంమీద యిది యథార్థమే. కాళిదాసు కృతులు సుపరిచితాలే కాని అతని జీవిత విశేషాలు యిప్పటివరకూ తెలియవు. కాకపోతే చరిత్రకు అగ్రాహ్యాలైన కట్టుకథలు, అభూతకల్పనలు అనేకాలు ఉంటే ఉండ వచ్చు. నాగార్జుని చరిత్రకూడ యిలాంటిదే. కాని యీతని విషయంలో యీ కథ మరొక మెట్టు పైకిపోయింది. ''వాస్తవంగా నాగార్జునుడనే వ్యక్తిలేడు, అది కేవలం కల్పితనామ'' మని వ్రాసినవారున్నారు. ఐనా నాగార్జున కొండవద్ద బయల్పడిన పురావస్తుసామగ్రిని బట్టి నాగార్జునుడు కల్పితవ్యక్తి కాదని తేలిపోయింది. ఇక నాగార్జునుడను వ్యక్తి ఒకరా అనేకులా అన్న ప్రశ్న బయలుదేరింది. కొందరు ఒకరన్నారు. మరికొందరు యిద్దరన్నారు, ఇంకొందరు ముగ్గురన్నారు. ఇంకా కొందరు బుద్ధిమంతులు నాగార్జునుల సంఖ్యను ఐదింటిదాకా పెంచారు. మొత్తంమీద ఆచార్య నాగార్జునుడు ఒక వ్యక్తి అనీ, సిద్ధ నాగార్జునుడు వేరొక వ్యక్తి అనీ, అదే పేరుతో తాంత్రికాచార్యుడు మరొకడున్నాడనీ చెబుతున్నారు.

ఇక్కడ మనకు ముఖ్యుడు మాధ్యమిక దర్శన ప్రవర్తకుడైన ఆర్య నాగార్జునుడు. ఇతడు

ఎప్పటివాడో తెల్సుకోవాలసి ఉంది. క్రీ.శ. 405 ప్రాంతంలో కుమారజీవుడు నాగార్జునుని జీవిత చరిత్ర చైనా భాషలోకి అనువదించాడు. కాబట్టి నాగార్జునుడు క్రీ.శ. 405 కి ముందే ఉండాలి.

కుమారజీవుని రచనను బట్టి ఈక్రింది విశేషాలు తెలుస్తున్నవి: నాగార్జునుడు పుట్టుకతో దాక్షిణాత్య బ్రాహ్మణుడు. అతడు నాల్గువేదాలు, సర్వశాస్త్రాలు క్షుణ్ణంగా చదువుకొన్నాడు. అణిమాది అష్టసిద్ధులు సంపాదించి వాని ప్రభావంవలన అదృశ్యమై సంచరించేవాడట. ఆ సిద్ధుల మహిమతో అతడు ముగ్గురు మిత్రులతో కలిసి అదృశ్యుడై రాజాంతఃపురానికి రాకపోకలు సాగిస్తూ వచ్చాడట. ఇలా సాగిస్తూ ఉండగా ఒకసారి మిత్ర సమేతంగా రాజభటులకు పట్టుబడి యీ గండం గడిచి పిండం బయటపడితే బౌద్ధభిక్షువు నౌతానని మ్రొక్కుకొన్నాడట. రాజు ఏకారణం వల్లనో అతని మిత్రుల ముగ్గురిని ఉరి తీయించి, అతనని మాత్రం వదలి వేశాడట. నాగార్జునుడు మొక్కుకొన్నట్లే బౌద్ధ భిక్షుత్వం స్వీకరించి తొంభైరోజుల్లో 'త్రిపిటకాలు' చదివి దానితో తృప్తిపొందక సూత్ర గ్రంథాల కోసం అన్వేషించాడు. తుదకు హిమాలయవాసియైన ఒక భిక్షువువల్ల మహాయాన సూత్రాలు, సర్పరాజగు నాగరాజువల్ల దాని భాష్యం సంపాదించాడట. అతడు దీక్షతో దక్షిణదేశంలో బౌద్ధమత ప్రచారం సాగిస్తూ 300 సంవత్సరాలు మతాచార్యుడుగ ఉన్నట్లు కుమార జీవుడు వ్రాశాడు.

అలా కాదు. 600 సంవత్సరాలు నాగార్జునాచార్యుడు జీవించాడని భోటదేశస్థుల ప్రచారం. అతనికి సిద్ధవిద్యయందేగాక, రసవిద్య, వైద్యశాస్త్రం, ఖగోళశాస్త్రం, రత్నశాస్త్రం మున్నయిన వాటిలోకూడ నైపుణ్యమున్నట్లు కుమారజీవుని రచన తెల్పుతున్నది,

ఈ పేర్కొన్నవాటిలో పుక్కిటి పురాణాలను మినహాయిస్తే మిగిలే విషయాలు చాల తక్కువ. నాగార్జునుడు దాక్షిణాత్య బ్రాహ్మణుడనీ, వివిధశాస్త్ర పారంగతుడనీ తెలుస్తున్నది. వింటర్‌నిట్జ్ మొదలైనవారు అతడు విదర్భవాసియనీ క్రీ.శ. 2వ శతాబ్ది ఉత్తరార్ధంలో ఉన్నాడనీ అంగీకరిస్తున్నారు. శ్రీ పర్వతం అతని వాసస్థానమనీ నాగార్జునుని కొండవద్ద బౌద్ధవిశ్వ విద్యాలయం నెలకొల్పాడనీ, అమరావతికి ప్రాకారాలు జీర్ణాలు కాగ తిరిగి కట్టించాడనీ, నాటి శాతవాహన చక్రవర్తి యాతనికి మిత్రుడనీ సుహృల్లేఖ యీ చక్రవర్తికి వ్రాసినదేననీ చరిత్రజ్ఞులు చెబుతున్నారు. సుహృల్లేఖను అబాలగోపాలం పవిత్ర గ్రంథంగా పారాయణం చేసిందని చైనా యాత్రికుని వ్రాతవలన తెలుస్తున్నది. ఈ పుస్తకం మూలంమాత్రం లభించటం లేదు. టిబెట్ చైనా భాషానువాదాలు మాత్రం ఈనాటికీ నిలిచి ఉన్నవి.

నాగార్జునుడు దక్షిణాపథ మందలి వేదలి నివాసియైన బ్రాహ్మణుడని లంకావతారం స్పష్టంగా చాటుతున్నది.

'దక్షిణాపథ వేదల్యాం భిక్షుః శ్రీమాన్ మహాయశాః
నాగాహ్వయః స నామ్నా తు సదసత్ పక్షదారకః. పే॥ 280. శ్లో॥ 165.

విదర్భవాసి ఐతే ఈ శ్లోకం ఆ విషయాన్ని చెప్పి ఉండేవి. అట్లు చెప్పటానికి ఛందస్సు అడ్డురాదు. కాగా యీవేదలి అన్నది ఎక్కడున్నది? చరిత్రజ్ఞులు తలుస్తున్నట్లు విదర్భ ప్రాంతంలోనిదే అయితే నాగార్జున కృతియైన 'రత్నావళి'లో లభిస్తున్న కొన్ని విషయాలకు వారు సమాధానం చెప్పుకోవాలి.

నాగార్జునుని కాలంలో మహాయానం నిందింప పడుతూ వచ్చింది. నాటి రాజుకూడ మహాయాన ప్రతికూలుడుగా కనిపిస్తున్నాడు. (నింద్యతే చాద్య మహాయానం మోహాత్ స్వపరవైరిభిః 4-79. ధర్మాధికారా యేచాన్యే పూర్వరాజప్రవర్తితాః దేవద్రోణ్యాదయ స్తేపి ప్రవర్త్యంతావ్ యథాస్థితాః 4-18) ఇట్టి సందర్భంలో విదర్భదేశం నుంచి వచ్చిన వ్యక్తి తెలుగు నడిగడ్డలో బౌద్ధ విశ్వవిద్యాలయం స్థాపించడానికీ, అమరావతికి ప్రాకారాలు తిరిగి నిర్మించటానికి ఎట్లు సాధ్యపడింది? ఎక్కడనుంచో వచ్చిన వ్యక్తికి యింత పలుకుబడి ప్రజాసహకారం ప్రాపించటం దుర్లభం కాదా? తత్త్వశాస్త్ర నైపుణ్యమే దీనికి కారణమనటానికి వీలులేదు కదా! పైగా మహాయానం నాడు నలుమూలలనుంచి ప్రతిఘటింపబడుతూ ఉంది.

కాబట్టి నాగార్జునుడు గుంటూరు, కృష్ణా, గోదావరి ప్రాంతాల వాడనటానికి అవకాశం కన్పిస్తున్నది. కాని విదర్భవాసి అనటానికి అవకాశం కన్పించటం లేదు.

తాత్త్వికరంగంలో నాడు నాగార్జునునకు ప్రాతికూల్యం ఉన్నది. రాజుకూడ విముఖుడే కాని సముఖుడు కాడు. అయినపుడు అతడు ఎలా ప్రజానురాగం సంపాదించగల్గాడు? ఏదో ఒకతీరున అతడు ప్రజలకు తోడ్పడి ఉండాలి. ఆ ప్రజాసేవ ఏమిటి? తత్త్వ నిరూపణం, ధర్మపన్నాలు ప్రజల్ని ఆకర్షించి ఉంటాయనటానికి వీల్లేదు. కాబట్టి కుమారజీవుడు పేర్కొన్న నాగార్జునుని వైద్యశాస్త్ర పారంగతత్వం యథార్థం కావచ్చు. ఆ నైపుణ్యంతోనే అతడు ప్రజలకు సేవచేసి వారి అనురాగం పొంది విశ్వవిద్యాలయాదికం నిర్మించి ఉండవచ్చును.

ఇక నాగార్జునుని కాలం నిర్ణయించవలసి ఉంది. సుహృల్లేఖ, రత్నావళి అను రెండు రచనలు శాతవాహన రాజులను ఉద్దేశించే నాగార్జునుడు వ్రాశాడని చరిత్రజ్ఞులందరు అంగీకరిస్తున్నారు. కాని ఏ రాజు నుద్దేశించి అవి వ్రాయబడ్డవి. అన్న ప్రశ్నకు సమాధానం చెప్పుకోవలసి ఉంది.

నాగార్జునుడు క్రీ.శ. రెండవ శతాబ్దిలో ఉన్నాడని చెప్పేవాళ్లు గౌతమీపుత్ర యజ్ఞశ్రీ నుద్దేశించి అతడు వ్రాశాడని అంటారు. కాని రత్నావళినిబట్టి నాటి రాజు మహాయాన ప్రతికూలుడుగా కన్పిస్తున్నాడు. పైగా ఆ మతంమీద అతనికి ద్వేషంకూడా ఉంది. అందువలననే దేవద్రోణ్యాది ఉత్సవాలను అతడు నిషేధించాడు. నాగార్జునుడు అతనికి హితం బోధిస్తూ ''బుద్ధుల వచనం గ్రహించటం కష్టం. కాబట్టి ఏకయాన, త్రియానోక్తాల నుంచి ఆత్మను ఉపేక్షచే రక్షించుకో. ద్వేషంవలన పాపంతప్ప, శుభం కలుగదు. ఆత్మకాములు మహాయానాన్ని ద్వేషించరాదు.'' అని స్పష్టంగా ఘోషించాడు. యజ్ఞశ్రీకి

మహాయానమందు ద్వేషమున్నట్లు చరిత్ర చెప్పటం లేదు. దీనికి తోడు నాగార్జునుడు పేర్కొన్న లక్షణాలన్నీ గౌతమీపుత్ర శాతకర్ణియందే కన్పిస్తున్నవి. అతడు "ఏక బ్రాహ్మణుడు. ఏకాంకుశుడు. ఏక శూరుడు, త్రిసముద్రతోయ పీతవాహనుడు, వినివర్తిత చాతుర్వర్ణ్య సంకరుడు" అని శాసనము పేర్కొంటున్నది.

ఇది యీలా ఉండగా యీ కాలాన్ని సమర్థించటానికి మరొక విషయంకూడా తోడ్పడుతున్నది దశ సహస్రా ప్రజ్ఞాపారమిత క్రీ.శ. 148లోనే చైనా భాషలోకి అనువదింపబడినట్లు చరిత్రజ్ఞులు చెబుతున్నారు. పారమితలకు ప్రాముఖ్యం, ప్రాచుర్యం నాగార్జున కృతులవల్లనే యేర్పడింది. కాని, అంతకుముందే ఏర్పండిందని ఊహించడానికి అవకాశం లేదు. ప్రయాణ సౌకర్యాలు నికృష్టంగా ఉన్న ఆకాలంలో ఒక పుస్తకం భారతదేశంలో ప్రసిద్ధిపొంది అది చైనాకు ప్రాకి అచట ఆభాషలో అనువదింప బడాలంటే కనీసం యాభై, అరవై సంవత్సరాలైన పడుతుంది. కాబట్టి క్రీ.శ. 1వ శతాబ్దంలో నాగార్జునుడు ఉండి వుండవచ్చును అనటం నిర్హేతుకం కాజాలదు. ఇది నిజమైతే అప్పటి శాతవాహన చక్రవర్తి గౌతమీపుత్ర శాతకర్ణేకాని యజ్ఞశ్రీకాదు.

నాగార్జునుడు గౌతమీపుత్ర శాతకర్ణికి సమకాలికుడని చెప్పవచ్చును. అంతేకాని అతడు ఫలాని సంవత్సరంలో జన్మించి, ఫలాని సంవత్సరంలో అస్తమించాడని దొరుకుతున్న సాధనసామగ్రినిబట్టి చెప్పలేము.

ఇక అతని జీవిత విశేషాలు కూడా ఇంతకుముందు చెప్పుకొన్న వానికంటె అధికంగా తెలియటంలేదు. రత్నావళిని జాగ్రత్తగా పరిశీలించినపుడు మాత్రం ఈ క్రింది విశేషాలు కనుపించకమానవు.

మహాయానం నాగార్జునునకు ముందే ఉన్నదికాని అతడు కొత్తగా ప్రతిపాదించి ప్రచారించింది కాదు. ఎందుకంటే "నింద్యతేద్ర్య మహాయానం మోహాత్ స్వపరవైరిభిః" అని అతడు స్పష్టంగా చెబుతున్నాడు. మహాయానం కొత్తగా వెలువడి నిందింపబడుతున్న ట్లైతే అతడు అంతగా బాధపడవలసిన అవసరం లేదు. కొత్తగా బయలుదేరినదాన్ని అపార్థం చేసికోవటంలో క్రొత్తదనం ఏమీలేదు. అలాకాక అది ప్రాచీనమయి అపార్థానికి పాల్పడుతూ ఉంటే నాగార్జునుడు నొచ్చుకోవటంలో అర్థం ఉంటుంది. కాబట్టి నాగార్జునునికి ముందే మహాయానం లోకంలో వ్యాపించి ఉండాలి.

తనకాలంలో మహాయానం తీవ్ర విమర్శనకు పాల్పడుతూ వచ్చింది. అందువల్లనే ప్రతివాదుల విమర్శలనుండి తనవాదం నిల్పుకోవలసిన ఆవశ్యకత నాగార్జునునకు కలిగింది. అందువల్లనే అతడు తన మేధాసంపత్తిని ప్రదర్శించి గ్రంథాలు వ్రాశాడు. అంతేకాని ఉబుసుపోక, జిజ్ఞాసా సమారాధనకోసం, అతడు గ్రంథకర్త కాలేదు. తను ప్రదర్శించిన యుక్తులతో తృప్తిపడక మహాయానంమీద తొట్టిమొట్టి విమర్శలు ప్రతిపక్షులు సాగిస్తూ ఉంటే నాగార్జునుడు విసిగి గండరించి, మాధ్యమిక దర్శనం 'తీర్థిక పశు భయంకరం' అని అంటానికి కూడా వెనుకాడలేదు.

ధర్మానికితప్ప మరొక లౌకిక శక్తికి తల ఒగ్గే స్వభావం నాగార్జునునకు లేదని రత్నావళి

చాటుతున్నది. అందులో అతడు ఇలా వ్రాస్తున్నాడు:- "రాజా! సామాన్యునికైనా అప్రియమయిన హితం చెప్పి వినిపించటం కష్టం. మరి రాజులకు చెప్పి వినిపించటం ఎంత కష్టమో వేరే చెప్పాలా! అందులో నీవు అతి భౌముడవు. నేను కేవలం సద్భిక్షువును. అయినా నే నొక్కణ్ణే నీకు మిక్కిలి అప్రియమయినప్పటికీ పథ్యం చెబుతాను. నీయందలి స్నేహం, లోకమందలి అనుకంపయే దీనికి కారణం. ఇంతే కాదు, మరొక అడుగు ముందుకు వెళ్ళి మద్యసేవనం మానుకో. దానివల్ల లోకంలో పరాభవం, కార్యహాని, ధనక్షయం సంభవిస్తాయి. పైగా చేయరానిపని చేయిస్తుంది," అని అతడు రాజదోషాలను ఒత్తి చికిత్స చేయటానికి ప్రయత్నించాడు.

నాగార్జునుడు విచారశీలుడేకాక పరైకాంతహిత బుద్ధి అని రత్నావళి వ్యక్తం చేస్తున్నది. "సత్యం అంటే అది సంవాదకం అయినది కాదు. సత్యా గుణోద్భూతమూ కాదు. పరైకాంత హితమే సత్యం" అని అతడు ఎలుగెత్తి చాటాడు. ఈ పరైకాంత బుద్ధిని పురస్కరించుకొని ఆయన నాడు కారాగార సంస్కరణలు సూచించాడు.

"దుష్టులను సన్మార్గానికి మరల్చటమే రాజునకు కోరదగిన విషయం. అంతేకాని ప్రతీకారబుద్ధితో అధికార ప్రదర్శనా అహంకారంతో రాజు శిక్ష విధించరాదు. న్యాయపుర స్సరంగా దండ ప్రహారాదులు దోషులకు విధంచబడినా, నీవు కృపాళుడవై శిక్షించాలి. నిజంగా మహాత్ముల కృపకు అస్పదులైనవారు తీవ్రపాపులు, హింస్రులు కాకపోతే మరెవరు? కారాగార బద్ధులలో శుష్కిస్తున్నవారిని రోజుకో అయిదురోజులకో ఒకసారి విడిచిపెట్టు. కారాగారంలో ఉన్నంతకాలం వారి స్నానాన్న పానాలకు, మందుమాకులకు, వస్త్రాలకు, క్షురకర్మాదులకు కావలసిన సదుపాయాలు చేయవలసింది." అని అతడు రాజుకు బోధించి తన కృపాళుత్వాన్ని చరిత్ర ప్రసిద్ధం చేసుకొన్నాడు.

పైగా ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి సారిగా శిక్షాస్మృతినుంచి మరణ దండనాన్ని తొలగించవలసిందని ఆర్య నాగార్జునుడు ప్రచారం చేశాడు. మనుస్మృతి పురాణేతి హాసాలలో ఇలాంటిసూచన లేకపోలేదు. కాని ఈ సూత్రాన్ని బ్రాహ్మణులకు మాత్రమే అన్వయించాలని మన వారన్నారు. నాగార్జునుడు అలాకాక మరణదండన పరిహారణం సర్వసామాన్యం కావాలని బోధించాడు. "లెస్సగా పరామర్శించి, లోతుగా తెలిసికొని ప్రదుష్టులను, ఘటకులగు నరులను చంపక, పీడించక, రాజ్యాన్నుంచి బహిష్కరించు" అని శాతవాహన చక్రవర్తిని హెచ్చరించాడు. అనాడతడు చాటిన సంస్కరణలను నేటికీ ఆచరించలేక పోతున్నాము.

అంధులు, వ్యాధిపీడితులు, వికలాంగులు, అనాథలు, బిచ్చగాండ్రు, అవిఘట్టితులై, అపరిభూతులై, యితరులతో సమంగా అన్నపానాలు పొందునట్లు చేయటం రాజధర్మమని చెప్పాడు. అర్థింపకపోయినా, అన్యరాజ్య సంస్థానాలలో వున్నా, కోవిదులైన సత్పురుషులను అనుగుణ సత్కారాలతో రాజు ప్రోత్సహించాలని అతడు సూచించాడు. దీనినిబట్టి నేటి నోబెల్ బహుమానాలవంటి వానిని యేర్పరచాలని అనాడే నాగార్జునుడు ఊహించాడన్న మాట.

మత విషయంలో ఇతడు సాగించిన ప్రబోధం ఆధునిక యుగానికిగూడ శిరోధార్యం. ''మత విషయంలో సత్యం గ్రహించుట దుష్కరంకాబట్టి ఉపేక్ష వహించడం మేలు. ఉపేక్ష పాపం కాదు. ద్వేషమేపాపం. ఈద్వేషంవల్ల శుభం కలుగదు. ఆత్మకాములైన వారు ఉపేక్షచేత తమ ఆత్మను రక్షించుకోవాలి.'' అని అతడు రాజునకు ఉపదేశించాడు. దీనినిబట్టి చూస్తే ఆనాడే మతప్రసక్తి లేని పరిపాలనను అతడూహించి ప్రచారంచేశాడా అని అనిపిస్తుంది.

నాగార్జునుని విశిష్టతను చాటే విశేషం మరొకటుంది. ప్రాచీనకాలంనుంచి నేటివరకు తమ తమ సిద్ధాంతాలను అంగీకరించని వారినందరిని నాస్తికులని నిందించటం పరిపాటి. ముఖ్యంగా మాధ్యమికుల విషయంలో ఇది తీవ్రరూపం వహించింది. ఇటీవల ఒక అద్వైత పండితుడు మాధ్యమిక వాదాన్ని గూర్చి ముచ్చటిస్తూ మీరు నాస్తికులని మాధ్యమికులపై నిందారోపణచేస్తే నాగార్జునుడు కాని, చంద్రకీర్తిగాని, దానిని త్రోసివేయలేదని వ్రాశాడు. ఇది కేవలం సాహసం అనే అనాలి. ఎందుకంటే నాగార్జునుడే స్వయంగా రత్నావళిలో యిలా వ్రాశాడు —

లోభ వ్యాపాద నాస్తిక్యా
దృష్టీనాం పరివర్జనమ్
ఏతే కర్మపథా శుక్లా... 1-9

నాస్తికో దుర్గతిం యాతి
సుగతిం యాతి చాస్తికః
యథాభూత పరిజ్ఞానాత్
మోక్షమద్వయ నిశ్రితః... 1-57

వినాశయతి దుర్ జ్ఞాతో
ధర్మోఽయ మవిపశ్చితమ్
నాస్తితా దృష్టిసమలే
యస్మాదస్మిన్ నిమజ్జతి... 2-19

ఈ విధంగా నాస్తికతను పూర్ణంగా నిరసించటమే కాక నాగార్జునుడు ఈ సమస్యను ఆ మూలాగ్రం పరిశీలించి హేతువాదు లందరికి అంగీకార్యమైన ఉత్తమోత్తమ పరిష్కార మార్గం సూచించాడు. అదేమంటే కర్మకు ఫలం ఉండదనేవాడు నాస్తికుడు. ఫలం ఉంటుందనేవాడు ఆస్తికుడు. వివిధమతాలకు సమన్వయంకుదిర్చి ద్వేషం పరిహరించా లంటే యింతకన్నా మేలైన మార్గం ఏమున్నది? ఈ నిర్వచనం ప్రకారం చెప్పవలసి వస్తే నేటి కమ్యూనిస్టులుగూడా తాము నాస్తికులమని చెప్పుకోగలరా?

నాగార్జునుడు కేవలం జ్ఞానశూరుడేకాక, కార్యశూరుడుగూడా. శుష్కతర్కాలు, క్రియా శూన్యోపదేశాలు, మెట్టవేదాంతాలు, కుహనా తపఃక్రియలు ఆయనకు గిట్టవు. అందువల్లనే అతడు యిలా అన్నాడు. ''కేవలశరీర తాపనంవల్ల ధర్మం నెలకొనదు. దానివల్ల పరద్రోహం అంతరించదు. పరులకు అనుగ్రహం వాటిల్లదు. దాన శీలక్షమాస్పష్టమైన

సద్ధర్మ పథం అంగీకరించక కాయక్లేశం అంగీకరించిన దండకోత్పధాలు పట్టిపోయేవాడు, క్లేశవ్యాలావలీఢాంగుడై అనంతజన పాదపము, ఘోరము అయిన సంసారాటవిలో సుదీర్ఘం వశిస్తాడు.''

నాగార్జునునకు తత్వశాస్త్రంలోను, సాంఘికోద్యమంలోను మాత్రమేకాక సంస్కృత వాఙ్మయంలో కూడ విశిష్ట స్థానం ఏర్పడుతుంది. అతనికి పూర్వం శాస్త్రగ్రంథాలు సూత్రబద్ధాలై ధారణయోగ్యాలుగా ఉండేవి. అర్థగ్రహణకు వాని భాష్యాలు తోడ్పడుతుండేవి. కాబట్టి సూత్రపద్ధతిలో శబ్దలాఘవమే కాని సుబోధకత్వం మృగ్యం. భాష్యపద్ధతిలో అర్థసుబోధకత్వమే కాని ధారణాసౌలభ్యం లేదు. సూత్రపద్ధతిలోని శబ్దలాఘవం. ధారణాసౌలభ్యమూ, భాష్యపద్ధతిలోని అర్థసుబోధకత్వము, వివరణము ఏకత్రితం చేయటానికి అతను నూతనమార్గం అవలంబించి కారికారచన పద్ధతిని మొట్టమొదటిగా సంస్కృతంలో ప్రవేశపెట్టాడు. అతని తర్వాతనే సంస్కృతంలో కారికారచన బహుళప్రచారం పొందింది. సాంఖ్యకారికలు, గౌడపాదకారికలు మున్నైనవి అతని రచనలకు తరువాతనే వెలువడ్డవి. కాబట్టి కారికారచనయందు అగ్రతాంబూలం నాగార్జుననిదే. ఇంతేకాదు కావ్యభేదాలలో ఒకటిగా ధ్వన్యాలోకాదులు పేర్కొన్న పరికథకుగూడా శ్రీకారం చుట్టినవాడు నాగార్జునుడేమో?

ఇలా వివిధరంగాలలో అనల్పకృషి చేసిన నాగార్జునుని కీర్తి రోళ్ళా, రోకళ్లా పలికింది. స్వతంత్ర విచారశక్తి ఉన్న ప్రతిమేధావి నాగార్జునుని కృతులను దూషించటమో భూషించడమో చేశాడేకాని ఔదాసీన్యం వహించలేదు. హొరుకుతున్న గ్రంథాలనుబట్టి చెప్పవలసివస్తే అతనివాదాన్ని భూషించిన వారికంటె అపార్థంచేసుకొని దూషించిన వారిసంఖ్య మెండు. ఒకవిధంగా అతను వివిధ దేశాలలో ప్రామాణికత్వం సంపాదించాడు. ఇది మరొకవిధంగా అతని కీర్తికి అవరోధమే అయినది. ఎందుకంటే తమ కృతులకు ప్రామాణికత్వం సంపాదించాలని పెక్కుమంది తమరచనల కర్తృత్వం నాగార్జునునకు అంటగట్టారు. అందువల్ల నాగార్జునుడు ఏయే గ్రంథాలు వ్రాశాడో నిస్సందేహంగా నిర్ణయించటం కష్టం. అతడు 24 గ్రంథాలు వ్రాసినట్లు చైనా త్రిపిటకాలు పేర్కొంటున్నవి.

నాగార్జునుని ప్రధానకృతులు ఆరని బూష్టను వ్రాశాడు. 1. మూలమాధ్యమిక కారికలు. 2. శూన్యతా సప్తతి. 3. యుక్తిషష్టిక. 4. విగ్రహవ్యావర్తిని. 5. వైదల్య సూత్రము ప్రకరణము. 6. వ్యవహార సిద్ధి.

## మూలమాధ్యమిక కారికలు:

అద్వైతులకు బ్రహ్మసూత్రాలు ఎలాంటివో మాధ్యమికులకు ఈ కారికలు అలాంటివి. ఇందులో మొత్తం 27 అధ్యాయాలు 448 కారికలు ఉన్నవి. ప్రతి అధ్యాయం ఏదో ఒక పదార్థాన్నో, వాదాన్నో పరీక్షిస్తుంది. వీనికి నాగార్జునుడు, బుద్ధపాలితుడు, భావవివేకుడు, గుణమతి, స్థిరమతి, చంద్రకీర్తి, గుణశ్రీ మున్నైనవారు సంస్కృతంలో ఎనిమిది వ్యాఖ్యానాలు వ్రాశారు. చంద్రకీర్తి వ్రాసిన ప్రసన్నపద తప్ప తక్కిన వ్యాఖ్యలు కనిపించటం లేదు. వీని భోట భాషానువాదాలు మాత్రం దొరుకుచున్నవి.

పైనచెప్పిన గ్రంథాలేకాక నాగార్జునుడు మరికొన్ని కృతులు వ్రాశాడు. రత్నావళి, చతుస్తవము, ప్రతీత్యసముత్పాద హృదయం, అనునవి నిస్సందేహంగా అతని కృతులె. ఉపాయ హృదయం మహాయాన వింశకం, అబుద్ధబోధకం, భవసంక్రాతి, సూత్రవృత్తి ప్రజ్ఞాదండం, ధర్మసంగ్రహంకూడా నాగార్జునుని రచనలుగ పేర్కొనబడ్డాయి. దీనిలో మహాయాన వింశకం, భవసంక్రాంతి, సూత్రవృత్తి, నాగార్జునుని రచనలు కావచ్చును.

మహాప్రజ్ఞాపారమితా శాస్త్రము, ద్వాదశభూమిని భాషాశాస్త్రం, ద్వాదశనికాయముఖ శాస్త్రం, ఏకశ్లోక శాస్త్రంకూడా నాగార్జునుని రచనలేనని చైనా త్రిపిటకాలు చెబుతున్నవి. వీనిలో ఏ ఒకటీ సంస్కృత భాషలో లభించటం లేదు.

ఇవికాక రసరత్నాకరం మున్నైన వైద్యశాస్త్రాదిక గ్రంథాలు నాగార్జునుని పేరుతో కనుపిస్తున్నవి. వైద్యంతో ప్రజాసేవచేసి నాగార్జునుడు ప్రజానురాగం సంపాదించి ఉంటే వీనినికూడా అతడే వ్రాశాడని చెప్పవచ్చును. కాని వైద్యశాస్త్రం తెలిసినవారికి మాధ్యమిక దర్శనంకాని, మాధ్యమిక దర్శనం తెలిసినవారికి వైద్యశాస్త్రంకాని సాధారణంగా తెలియవు. అందువల్ల రసరత్నాకరాదుల కర్తృత్వం ఇంకా పరిశీలించవలసి ఉన్నది.

ఆర్య నాగార్జునుడు తన దార్శనిక గ్రంథాలు వ్రాయకపోయినట్లయితే ఈనాడు అతన్ని పేర్కొనవలసిన అవసరం లేదు. అతడు వైద్యగ్రంథాలు వ్రాసి ఉన్నా, సాంఘిక రాజకీయాభి వృద్ధికోసం బహుశా పాటుబడిఉన్నా వాటికి చారిత్రక ప్రాముఖ్యంతప్ప మరొక విశిష్టత లేదు. ఎందుకంటే ఈ విషయాల్లో ఆధునికయుగం ఎంతో అభ్యుదయం సాధించింది. నాటికీ నేటికీ వైద్యరంగంలో ఎన్నో నూతన విశేషాలు కనుగొనటం జరిగింది. అతని రాజకీయభావాలు నాడు ఉత్తమోత్తమాలు కావచ్చును కాని యివ్వాళ అవి సర్వ సామాన్యాలు. పోతే అతని దార్శనిక భావాలు మాత్రం అలాంటివి కావు. విజ్ఞానశాస్త్రంలో మనం ఎంతో పురోగమించి ఉండవచ్చును. కృతకోపగ్రహాలను భూచంద్రుల చుట్టూ ప్రదక్షిణం చేయించవచ్చును. రేపు కుజగ్రహానికిపోయి సేద్యంచేసి పంటతో తిరిగి రావచ్చును. నాడుకూడ అతని దార్శనిక భావాలు ఆలోచనీయాలే.

ఇంతకూ నాగార్జునుని దర్శనం ఏమి చెబుతున్నది? అందులో ఉన్న విశిష్టత ఏమిటి?

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పకముందు ఒక విషయం గ్రహించాలి. అతని దర్శనం అంత తేలిగ్గా అర్థంకాదు. పైగా అపార్థం చేసుకోవటానికి అవకాశాలు మెండు. ఈ విషయాన్ని నాగార్జునుడే అంగీకరిస్తూ మాధ్యమికవాదం అతి గంభీరమనీ ఒకమాత్రాన బోధపడదనీ అన్నాడు. దుర్భుక్తమైన అన్నం విషమై హానికలిగిస్తున్నట్లే దుర్జ్ఞాతమైన మాధ్యమిక వాదం ఘోర నీచస్థితికి కొనిపోతుందని అతడే హెచ్చరించాడు. ఇలాంటి క్లేశం ఉండుటంవల్లనే వైదిక మతానుయాయులేమి, తదన్యులేమి అతనిని అర్థం చేసుకొన్నవారు చాల తక్కువ. ఈ కారణం వల్లనే శతాబ్దులనుంచి మాధ్యమిక వాదం దూషణకు పాల్పడుతూ వచ్చింది.

# మాధ్యమికవాదం

నాగార్జునుని వాదం మాధ్యమిక వాదమనీ, శూన్యవాదమనీ, అద్వయ వాదమనీ, ప్రతీత్య సముత్పాద వాదమనీ, అజాత వాదమనీ పిలువబడుతున్నది. కేవలం శబ్దాన్నిబట్టే యీ వాదాన్ని అర్థంచేసికోవటానికి పూనుకుంటే అపోహలకు పాల్పడక తప్పదు.

నాగార్జునుని సిద్ధాంతం యుక్తిమీద ఆధారపడుతున్నదేకాని వైదిక దర్శనాలవలె శ్రుతి మీద ఆధారపడటం లేదు. ఇక ఈ యుక్తి ఇతరులను సంస్కరించి ఒప్పించటంకోసం కాక ఎవనికివాడుగ తత్త్వం గ్రహించటానకి ఉద్దేశించబడ్డది. మాధ్యమిక మతంలో యుక్తి ఆధ్యాత్మిక జుగుప్స.

మానవుడు తన జీవితంలో విభిన్నానుభవాలు పొందుతుంటాడు. ఈ అనుభవిస్తున్న అవస్థలలో ఒకప్పుడు విరోధం కన్పిస్తుంది. అలాంటి విరోధం కన్పించినప్పుడే ఏది సత్యం? అన్న జిజ్ఞాస అతనిలో అంకురిస్తుంది. ఈ అంకురం తల యెత్తనంతవరకు అతనికి కనువిప్పు కలుగదు. అపుడే అతడు ఆలోచన కుపక్రమిస్తాడు. ''అలా చెప్పుకొంటే యిందులో యీ చిక్కులున్నవి; ఇలా చెప్పుకొంటే యీ బాధలు ఉన్నవి'' అని మానవుడు తనకు తాను పరామర్శించుకొంటాడు.

ఈ పద్ధతినే మాధ్యమికులు అనుసరిస్తారు. దీనినే ప్రాసంగిక పద్ధతి అంటారు. ఈ పద్ధతి ఒక దృక్పథాన్ని కాని, వాదాన్నికాని నిరాకరించటానికి ఉపయోగపడుతుందే, కాని, ఒక సిద్ధాంతాన్ని వ్యవస్థాపించటానికి ఉపకరించదు. ఒక వాదం ఒక అర్థాన్ని ప్రతిపాదించిన పుడు ప్రాసంగిక పద్ధతి దానిని ఎదుర్కొని అందులోని అనిష్టాలను వెల్లడించి తద్వారా ఆ వాదాన్ని త్రోసివేస్తుంది. ఇలా చేయాలంటే నిరాకరించే వాదవిధానాన్ని పురస్కరించుకొని దోషాలను వెల్లడించవలసి ఉంటుంది. ఉదాహరణకు న్యాయవాద పరామర్శం తీసికొందాం. ఆ న్యాయసిద్ధమైన అనుమానం చేతనే ఆ వాదమందలి దోషాలను చూపాలి. ప్రాసంగిక పద్ధతి యీ మార్గాన్నే అనుసరిస్తుంది.

ఇక్కడ ఒక శంక కలుగవచ్చు. ఒక ప్రతిజ్ఞను మాధ్యమికుడు త్రోసివేస్తున్నాడంటే తద్విరుద్ధ ప్రతిజ్ఞను అతడు అంగీకరించిన వాడు కావటంలేదా?

రాజుగారి పెద్దభార్య పతివ్రత అంటే చిన్నభార్య పతివ్రత కాదనేకదా అర్థం. మాధ్యమికులు ఈ అర్థాన్ని అంగీకరించరు. రాజుగారి పెద్దభార్య ప్రవృత్తి తెలిసి ఉండవచ్చును. దానినిబట్టి ఆమెను పతివ్రత అనవచ్చును. చిన్నభార్య గుణగణాలు తెలియకపోవచ్చును. కాబట్టి ఆమె శీలాన్నిగూర్చి చెప్పకపోవచ్చును. అంతేకాని అగ్రమహిషీ ప్రశంసా కనిష్ఠ భార్యాగర్హణం ఉద్దిష్ట మనటం శాస్త్ర సమ్మతం కాదు. రెండు వస్తువులలో ఏదో ఒకటి ఉండటానికి వీలుండి ఒకటి లేదని తేలిపోతే విధిగా రెండవది ఉందని చెప్పవచ్చును. అంతేకాని పెక్కులు ఉండటానికి వీలున్నపుడు, ఒకటి కాదు అనినంతమాత్రాన తద్విరుద్ధాన్ని అంగీకరించినట్లు భావించరాదు. ఒక ఆవు తెల్లనిది కాదన్నపుడు అది నల్లనిదని

అర్థంకాదు. అని పుల్లావుకావచ్చును, లేదా మైలావుకావచ్చును, లేదా దోరావుకావచ్చును. అలాగే తత్త్వంకూడ బహువిధాలుగ ఉండవచ్చును గదా! అలాంటప్పుడు ఒక ప్రతిజ్ఞను కాదని నిరాకరించినంత మాత్రాన తద్విరుద్ధ ప్రతిజ్ఞను ఆమోదించినట్లు కాదు. ఉదాహరణకు ఒకడు సత్కార్యవాదాన్నే నిరాకరించాడనుకొందాం. అంతమాత్రాన అసత్కార్యవాదాన్ని అమోదించాడని చెప్పటానికి వీలులేదు. సత్కార్యవాద ప్రతిషేధం కేవలం తన్నిరాకరణాన్ని తెలుపుతుందేకాని దానికి విరుద్ధమైన అసత్కార్యవాద అమోదాన్ని, తెల్పదు. ఈ ప్రతిషేధం కేవలం ప్రసజ్య ప్రతిషేధమేకాని విరుద్ధార్థ విధానం కాదు.

సామాన్యంగా ఏవిషయంలోనైనా దృష్టులేమి, అభిప్రాయాలేమి, వాదాలేమి నాల్గు విధాలుగ ఉండవచ్చును. అంతకుమించి ఉండటానికి వీలులేదు. ఒక వేళ ఉంటే ఈ నాలుగింటిలో దేనిలోనో ఒకదానిలో అంతర్భవించక తప్పదు. (1) సత్కోటి (2) అసత్కోటి (3) సదసత్కోటి (4) అనుభయకోటి.

## కార్యకారణ భావం

కార్యకరణ భావంలోకూడా ఈ నాల్గు దృష్టులే కనబడుతున్నవి: (1) సత్కార్యవాదం (2) అసత్కార్యవాదం (3) సదసత్కార్యవాదం (4) తదనుభయవాదం.

సత్కార్యవాదం కారణకార్యములకు అభేదాన్ని, అసత్కార్యవాదం భేదాన్ని, సదసత్కార్యవాదం భేదాభేదాన్ని, అనుభయ కార్యవాదం భేదాభేదాల అనుభయత్వాన్ని ప్రతిపాదిస్తుంది.

మాధ్యమికవాదం ప్రసంగాపాదము గాన ఈ నాల్గు వాదాలను నిరాకరిస్తుంది. కారణకార్యములు అభిన్నాలని ప్రతిపాదించే సత్కార్యవాదాన్ని అంగీకరిస్తే కారణము, కార్యము ఒకటి కావాలి. ఈ పక్షాన తనవలన తానే పుట్టవలసి వస్తుంది. ఉదాహరణకు విత్తనాన్ని - మొలకను తీసుకుందాం, సత్కార్య వాదం విత్తనం, మొలక ఒకటేనని చెబుతున్నది. అప్పుడు విత్తనంనుంచి విత్తనం కాని, మొలకనుంచి మొలకకాని పుట్టవలసి వస్తుంది. కాని విత్తనం నుంచి విత్తనంకాని మొలక నుంచి మొలకకాని పుట్టటం లేదు. కార్యకారణాలు ఒకటే అయితే ఈ పుట్టుకకు అర్థం లేదు. పైగా దీనికి ఆది అంటూ లేక అనవస్థాదోషం ఏర్పడుతుంది. ''దోషాలు రానీ, పోనీ; యిదే యథార్థం, తత్త్వం. ఇలా ఉన్నప్పుడు మనమేమి చేయగలం?'' అని అంటే, అన్న భక్షకులను అమేధ్య భక్షకులని చెప్పవలసి వస్తుంది. వాస్తవానికి మానవుడు అన్నం తింటున్నాడు కాని అమేధ్యం భక్షిస్తున్నాడా?

## శ్రుతిప్రమాణ మంగీకరించని

## శూన్యవాదం

ఈ సందార్భాన సత్కార్యవాది తన అసమ్మతిని సూచిస్తూ ఇలా అడ్డుతగులవచ్చును. ''మే మలా చెప్పటంలేదు. అనభివ్యక్తమైన దానిని కారణమనీ, అభివ్యక్తమైన దానిని కార్యమనీ చెబుతున్నాం. బీజంలో అంకురం అనభివ్యక్తంగా ఉన్నది. కాబట్టే బీజాన్ని

కారణమంటున్నాం. బీజంవల్ల అంకురం అభివ్యక్తమౌతున్నది. ఇలా అభివ్యక్తమౌతున్న అంకురాన్ని కార్యమంటున్నాం'' అని తన వాదాన్ని సమర్థించుకోవచ్చు. మాధ్యమికుడు యిది సమర్థనీయం కాదని త్రోసివేస్తూ ఇలా ప్రశ్నిస్తాడు. ''మీరు చెప్పిన అనభివ్యక్తికి అభివ్యక్తికి భేదం ఉన్నదా లేదా, భేదం లేదంటే ఇంతకుముందు చెప్పిన దోషాలన్నీ వెన్నాడుతునే వున్నవి. ఉన్నదంటే అసత్కార్యవాదులౌతున్నారు కాని సత్కార్యవాదులు కావటంలేదు. కాబట్టి తను సత్కార్యవాదం ఆదరణీయం కా''దని పెదవి విరుస్తాడు.

## అసత్కార్యవాద ఖండన

పోనీ అసత్కార్యవాదం అంగీకరించటానికి వీలౌతుందా? కారణం వేరు, కార్యమువేరని నైయాయిక వైశేషికాదుల సిద్ధాంతం. ఇదే యథార్థమైతే కారణానికి కార్యానికి సంబంధం ఏర్పడటానికి వీలులేదు. అపుడు దేనినుంచి ఏదైన కలగవచ్చును. ఇసుకనుంచి తైలం, గండశిలా గుళికలనుంచి అంకురాలు, వ్రణంనుంచి క్షీరం, స్తనంనుంచి చీము పుట్టవలసి వస్తుంది. కాబట్టి యిది సమ్మతం కాజాలదు.

ఈ సందర్భాన అసత్కార్యవాది ఇలా అనవచ్చును. ''అయ్యా! మీరు తొందరపడుతున్నారు. కార్యకారణ భావం నియమరహితమని మేము చెప్పటంలేదు. ఏది విధిగా ముందుగా ఉండటంవల్ల మరొకటి తరువాత కలుగుతన్నదో, ఏది లేక ఈ మరొకటి ఉండదో ఆ మరొకదానిని కార్యమంటున్నాం. దేనివల్ల ఉత్తరకాలంలో కార్యం కలుగుతున్నదో, దానిని కారణమంటున్నాం. అంతేకాని నియమరహితంగా ఉన్న వస్తువులకు కార్యకారణభావం మేము చెప్పటం లేదు. కాబట్టి మీ దూషణ మావాదానికి వర్తించదు.''

మాధ్యమికావతార కర్తయైన ఆచార్య చంద్రకీర్తి దీనిని ఇలా ప్రత్యుత్తరిస్తున్నాడు. ఇలాంటి కార్యకారణవాదిని ఈ విషయం అడగాలి. వరి మొలకకు వరిగింజయే కాని గురిగింజ కారణంకాదు. వరిగింజకు వరి మొలకయేకాని గురివెంద కార్యంకాదు. ఈ రూపంతో ఉన్న ఈ నియమం దేనివలన కలుగుతున్నది? అని ప్రశ్నిస్తే ప్రతివాది, నియమం కనిపిస్తున్నది కాబట్టి, అని సమాధానం చెబుతాడు. ఈ నియమం ఎందుకు కనిపిస్తున్నది అని తిరిగి ప్రశ్నిస్తే అతడు నియమం కనిపిస్తున్నది కాబట్టి ఉన్నది అని చెప్పవచ్చును. ఇలా చెప్పటం అంటే హేతువును చెప్పకపోవటమే. కాబట్టి అసత్కార్యవాది ఇంతకుముందు చెప్పిన దోషాలనుంచి తప్పించుకోలేడు. కాగా అసత్కార్యవాదం అంగీకార యోగ్యం కాదు.

## సదసత్కార్యవాద ఖండన

మరి సదసత్కార్యవాదం సమర్థనీయమా? ఈవాదాన్ని అనుసరించి కార్యకారణాలకు ఒక విధంగా అభేదం, మరొక విధంగా భేదం కలుగుతుంది. జైనులు, హెగెల్ మొదలైనవారు ఈవాదాన్నే ప్రతిపాదిస్తున్నారు. ఈ వాదంలో ఇంతకు ముందు పేర్కొన్న వాదద్వయం లోని దోషాలన్నీ పుంజీభవించి సాక్షాత్కరిస్తున్నవి. పైగా పరస్పర విరుద్ధ ధర్మాలు ఏకకాలంలో ఏకస్థానంలో ఉండటం అసంభవం. వెలుగు చీకట్లు పరస్పరం విరుద్ధాలు. ఈ

రెండూ ఒకేచోట ఒకే కాలంలో ఉండవు. కాబట్టి కార్యకారణ భావానికి భేదాభేదం ప్రతిపాదించటం సమంజసం కాదు. వాస్తవానికి విరుద్ధ ధర్మాధ్యాసవంతమయినది ఏక పదార్థంకాదు. కాగా ఈవాదం కూడ అనాదరణీయమే అవుతున్నది.

## సదసదనుభయ కార్యవాద ఖండన

ఇక మిగిలినది సదసదనుభయ కార్యవాదం. ఈ వాదాన్ని ఎవరు ప్రతిపాదించారో తెలియదు. మొత్తముమీద హేతువు లేకుండానే కార్యోత్పత్తి జరుగుతుందని ఈ వాదం చెబుతున్నట్లు అర్థం చేసికోవలసి వస్తున్నది. ఇదే యథార్థమయితే నాటువేయకుండానే రైతు పంటకోసం సంచులు పట్టవలసివస్తుంది. పైగా వాదరీత్యాకూడ వ్యాఘాతం కలుగుతున్నది. ఈవాదాన్ని ప్రతిపాదించేవారు హేతువులేదని సమర్థించుకోవాలి. సమర్థనకై అతడు హేతువును ఉదాహరిస్తే ప్రతిజ్ఞాభంగం కల్గుతుంది. ఉదాహరింపక మానివేస్తే కేవల ప్రతిజ్ఞవలన ప్రయోజనం కలుగదు.

కాగా ఈ నాల్గువాదాలలో ఏదీ సమర్థనీయం కాదు. ఆదరణీయమూ కాదు. ఐతే ఇంక దేనిని ఆదరించాలి. అన్న ప్రశ్న కలగక తప్పదు. దీనికి మాధ్యమికవాదం చెప్పే సమాధానం ఒకటే ఉన్నది. ఏ వాదమూ సమర్థనీయం కాదు. కాబట్టి ఏవాదంలోనూ అభినివేశం పనికిరాదు. బోధిసత్త్వులు దృష్టినే పరిహరించాలి. దృష్టి అన్నది ఉన్నంతకాలం సంసార నిమజ్జనోన్మజ్జనాలు తప్పవు.

ఇంతకుముందు పరీక్షించిన నాల్గువాదాలను సంగ్రహంగా చెప్పాలంటే సద్వాదమని, అసద్వాదమని చెప్పవచ్చును. ఈ రెండువాదాలను త్రోసివేసుతన్నది కాబట్టి మాధ్యమిక వాదానికి అద్వయవాదమన్న పేరు వచ్చింది. ఈ అద్వయసమగ్రార్థం మున్ముందు స్పష్టమౌతుంది.

మనం అనేక వస్తువులను చూస్తున్నాము. ఊహిస్తున్నాము. అనుభవిస్తున్నాము. ఈ వస్తువుల తత్త్వమేమిటి? మాధ్యమికుడు ఇవన్నీ ప్రతీత్యసముత్పన్నాలు అని అంటాడు. ముందు ప్రతీత్యసముత్పాదమన్న దానికి అర్థం తెలుసుకోవాలి. దీనికి చంద్రకీర్తి వివరణ ఎంతైనా తోడ్పడుతుంది.

అతడు చూపిన ప్రక్రియనుబట్టి ప్రతీత్య అని కాని ప్రతీత్యము అనికాని సిద్ధిస్తుంది. 'ఇ' అనునది గత్యర్థక ధాతువు. 'ప్రతి' అనునది ఉపసర్గ. ఉపసర్గవల్ల ధాతువు అర్థం అనేకవిధాల మారుతుంది. ప్రతి అను ఉపసర్గతో గూడిన 'ఇ' ధాతువుయొక్క కృదంత రూపం ప్రతీత్యము. మిక్కిలి భంగురమయిన ఉత్పాదము ప్రతీత్యము. ఈ అర్థం సర్వాస్తివాదులకేగాని మాధ్యమికులకు సమ్మతంకాదు. ప్రతి అను ఉపసర్గతో గూడిన 'ఇ' అను ధాతువుయొక్క ల్యబంతరూపం ప్రతీత్య. ఇది అవ్యయం. దీనికి పొంది అని అర్థం. పొంది పుట్టటమే ప్రతీత్య సముత్పాదం అనగా కారణాలను పొంది పుట్టుట అని భావం.

ప్రపంచంలోని భావాలన్నీ కారణాలు పొంది కలుగుతున్నవి. ఉత్పత్తి స్థితి లయాలు కల దానిని భావమంటారు. ఈ భావాలు కారణాలవల్ల కలుగుతున్నవి. కారణాలు లేనప్పుడు

కలగటం లేదు. ఉదాహరణకు ఘటాన్ని తీసుకొందాము. ఈ ఘటమనేభావం మట్టి, కుమ్మరి, సారె, దండము మున్నైన కారణసామగ్రి ఉన్నప్పుడు ఏర్పడుతుంది. ఆ సామాగ్రి లేనప్పుడు ఏర్పడదు. వాస్తవానికి ఈ ఘటం మట్టిలో లేదు. ఉంటే దానిని ఘట మంటామేకాని మట్టి అని అనము. అలాగే ఈ ఘటం కుమ్మరిలో లేదు. అతని వ్యాపారంలోనూ లేదు, అతని దండంలోకాని, సారెలోగాని లేదు. ప్రత్యేకంగా దీనిలో ఒక్కొక్క దానిలో లేకపోవచ్చును. కాని వాని సామగ్రిలో ఉండవచ్చును గదా అని తోచవచ్చును. నిజానికి అన్నిటిలోగూడా లేదు. ఉంటే వాటినన్నిటిని కలిపి కుండ అనాలి. అంటున్నామా? లేదు. కాబట్టి వాని సామగ్రిలో లేదు. పైన పేర్కొన్న వానిలో ఎందులోనూ లేదు. కాబట్టి ఘటం నిఃస్వభావం. నిఃస్వభావం కాబట్టి శూన్యం.

ఘటంలాగానే సర్వభావాలు శూన్యాలు. కారణాలు పొంది పుట్టేది స్వభావంకలది కాదు. (ప్రతీత్య యద్ యద్ భవతి నహితావత్ తదేవతత్ - మా.కా. 18-10). అప్రతీత్య సముత్పన్నమయిన ధర్మంకూడా లేదు. కాబట్టి అశూన్యమయిన ధర్మమూ లేదు. (అప్రతీత్యసముత్పన్నో ధర్మోకశ్చిన్న విద్యతే। యస్మాత్ తస్మాత్ అశూన్యోహి ధర్మః కశ్చిన్న విద్య తే॥ మా. కా. 24-19) కారణాలుపొంది కలుగునది స్వభావంచేత శాంతమే కాని మేరొకటికాదు. (ప్రతీత్య యద్ యద్ భవతి తత్ తత్ శాంతం స్వభావతః మా.కా. 7-16).

ఇక్కడ శూన్యమన్న శబ్దాన్ని సరిగా అర్థం చేసుకోవలసి ఉంది. శూన్యమనగానే వ్యవహార బలాన్నిబట్టి లేనిదని కాని, వైనాశికమని కాని అర్థం చేసుకొంటాము. నాగార్జును నికి పూర్వికులు, అర్వాచీనులు అలాగే అర్థంచేసికొని మాధ్యమిక వాదాన్ని గ్రహించలేక లేనిపోని దురర్థాలు కల్పించి దూషించారు. కాని మాధ్యమికుల శూన్య శబ్దానికి అర్థం అది కాదు. కారణ ప్రత్యయాపేక్షమైనది అని అర్థం: అంతేకాని అత్యంత అభావమని అర్థం చేసుకోరాదు. కారణాలుంటే అది ఉంటుంది, లేకపోతే ఉండదు. ఉదాహరణకు ప్రతి బింబం తీసికొందాము. ప్రతిబింబం ఎప్పుడు కన్పిస్తుంది? అద్దం అనేది ఒకటి ఉంటాలి, దానిముందు ఒకవస్తు వుండాలి. అంతమాత్రాన చాలదు. కటిక చీకటిలో ఈరెండూ ఉన్నా ప్రయోజనంలేదు. వెలుగుకూడా కావాలి. అప్పుడు ప్రతిబింబం కలుగుతుంది. కాని దానిజ్ఞానం పొందటానికి ద్రష్ట ఒకడు కావాలి. అప్పుడే ప్రతిబింబం ఉన్నది అని చెప్పడానికి వీలౌతుంది. ఈ పేర్కొన్న కారణాలలో ఏది లోపించినా ప్రతిబింబ జ్ఞానం కలుగదుగదా! మాధ్యమికులు ఇదే చెపుతున్నారు.

ఈ ప్రతిబింబజ్ఞానం పారమార్థికమా? అన్నది ప్రశ్న. కాదని నాగార్జునుడు అంటాడు. హేతు ప్రత్యయాలవల్ల కలుగుతున్న దంతా వ్యావహారికమే కాని పారమార్థిక సత్యం కాదని అతని సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ఎలా కలుగుతున్నది?

ఇంతకుముందు ఘటోత్పత్తినిగూర్చి కొంత చెప్పుకొన్నాము. ఘటం మృత్తికలోకాని, కుమ్మరిలోకాని, అతని పనిలోకాని, అతని దండచక్రాదులలోకాని లేదు. కాబట్టి అది పారమార్థిక సత్యం ఎలా అవుతుంది?

(తరువాయి వచ్చే సంచికలో)

# మాతృదేవోభవ

## (అమెరికా కోర్టులో జరుగుచున్న వివాదము)

అన్నా జాన్‌సన్ యిల్లాలు నిండుగర్భవతి - గర్భిణులందరి వలెనే నిండుగా కనపడ్తున్నది. త్వరలో కంటుంది. కాలిఫోర్నియాలోని గార్డెన్‌గ్రావ్‌లో ఆమె ఒక నర్సు వుద్యోగరీత్యా.

ఏడునెలల చూలాలు అయినా, పుట్టబోయే శిశువు ఆమెది కాదట! బీజం, క్షేత్రం--రెండూ ఆమెవికావు! కాలిఫోర్నియాలోనే ఆరెం కౌంటేకి చెందిన శ్రీమార్క్ కాల్వర్ట్, అతడిభార్య శ్రీమతి క్రిష్టియన్ వాన్ డ్యూసెన్‌వి- ఆమె గర్భాన్ని తమ బిడ్డను మోయడానికి అద్దెకు తీసుకున్నారు. ప్రతిఫలంగా పదివేల డాలర్లకు కిరాయి మాట్లాడుకున్నారు. అడ్వాన్సుగూడా యిచ్చారు. క్రిష్టియన్‌కు ఒక శస్త్రవైద్య ఫలితంగా గర్భధారణ అసాధ్యమయినందువలన, ఇట్లు అన్నా గర్భాశయాన్ని అద్దెకు తీసుకొనవలసి వచ్చింది. అంతవరకూ మాట నిల్పుకుంది. ఈ మధ్యనే అన్నా జాన్‌సన్ తనకు పుట్టబోయే బిడ్డ తనదే అనే మమకారం ఏర్పడింది. ఆ కోర్కెను మన్నించమని కోర్టులో కేసు దాఖలు చేసింది.

**1987**లో ఇటువంటి సమస్యకు సంబంధించిన ఒక కేసు జరిగింది. మేరీ బెత్ వైట్‌హెడ్ అనే ఆమె మరొకరికి బీజాభివృద్ధికి కిరాయి క్షేత్రంగా ఉండడానికి ఒప్పుకుంది; ఆ దంపతులతో ఆవిధంగా ఒప్పందం చేసుకుంది. మేరీ నిజంగా కన్నతల్లే అని కోర్టు ఒప్పుకుంది కానీ, చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆ బిడ్డ ఆమెదికాదు! ఆమె గర్భవాహకురాలు మాత్రమే.

ఇక ఇప్పుడు--కాల్వర్ట్ దంపతుల వ్యవహారం మరో మలుపు తిరిగింది. ఏమంటే--వాళ్ల శుక్లశోణితాలు ఒక ప్రయోగశాలలో సంయోగంచెందినాయి - పిండస్థాయికి పరివర్తనం చెందినది ఆ సంయోగం. పిమ్మట ఆ పిండాన్ని అన్నా గర్భాశయంలో జొప్పించారు. ఆమెను గర్భవాహకురాలుగా మాత్రమే నియమించుకున్నారు.

గర్భవాహక వ్యాపారం పెరుగుతున్నది. గత మూడు ఏళ్లలో ప్రపంచంలో ఎనభై జననాలు ఈ విధంగానే సంఘటిల్లినాయి. ఇదే కాలంలో అమెరికాసంయుక్త రాష్ట్రాలలో రెండువేల మంది పరబీజ వాపనం చేయించుకుని, పరులకోసం బిడ్డలను కిరాయికి కన్నారు.

ఇది అంతా సాంకేతిక విజ్ఞానాభివృద్ధి ఫలితం. కానీ నైతిక, న్యాయశాస్త్ర సమస్యలనేకం ఉత్పన్నం అవుతున్నాయి. తల్లి తండ్రులంటే ఎవరు అనేది కాల్వర్ట్ దంపతుల వ్యవహారంద్వారా పెద్ద ప్రశ్నగా ఎదురవుతున్నది.

అన్నా తరపు న్యాయవాది ఇట్లా అంటున్నాడు. ''కాల్వర్ట్ పిండదానం చేసినంత మాత్రాననే అతడు తండ్రికాజాలడు. అన్నా కేవలం ఒక ప్రసూతి యంత్రంకాదు. శిశువును రూపొందించే యంత్రమూ కాదు.'' కిరాయికి ఆమె

కడుపును అమ్ముకోవటం అనేది జుగుప్స కలుగజేస్తుంది.

కాల్వర్ట్ దంపతుల న్యాయవాది ప్రతివాదం ఇట్లా ఉంది. ''జీవశాస్త్రం ప్రకారం, అన్నా గర్భంలోని శిశువు కాల్వర్ట్ దంపతుల సంయోగఫలం. వారు చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆమె శిశువును కనేది మాత్రమే. కట్టేంది కాదు. కట్టడంలో ఆమె పాత్ర లేదు. ఆ ఒప్పందం అనుసరణీయమైనది.''

కాల్వర్ట్ దంపతుల తరపువాదం పటిష్ఠమైనదే కావచ్చు--వారికి జీవశాస్త్రం అనుకూలం కావచ్చు. కానీ కోర్టులో వాద వివాద సరళి ఫలితం మాత్రం అనూహ్యం. కోర్టు తీర్పు ఎట్లా ఉంటుందో జీవశాస్త్రం తేల్చలేదుగదా. ''కట్టిన స్త్రీకీ, కన్న స్త్రీకీ, ఇద్దరికీ జీవశాస్త్రానుసారం, బిడ్డపైన హక్కు ఉంటుంది'' అని శాస్త్రవేత్తల భావం. మరొక పరిశోధకుని అభిప్రాయం ''గర్భ ఉత్పత్తికి కారణమైన ఆమెకూ, గర్భవాహకగా ఉన్న ఆమెకూ, ఇద్దరికీ పోల్చి చూస్తే గర్భవాహకగా ఉన్న ఆమెకే మాతృత్వాధికారం ఉన్నట్లు చెప్పాలి. మోయడంలో అనుభవించాల్సిన బెడద లన్నీ ఎదుర్కొన్న గర్భవాహకురాలికే అసలు హక్కు ఉండడం న్యాయం'' (కాని యీ పనికిగాను పైసలు తీసుకుంది అనే విషయం గమనించాలి).

అసలు ఈ పరగర్భవాహనం నైతికంగా తప్పు అనేవారున్నారు. ధనిక దంపతులు ఈ విధంగా పేద స్త్రీలను ఉపయోగించుకుంటారని నిరసించే వారున్నారు. ''మతం-వైద్య విజ్ఞానం'' రెండిటా అధికారి అయిన ఒక వ్యక్తి ''పరగర్భ వాహకం కేవలం వైద్యావసరాలకు పరిమితం కావాలి. వ్యాపారంగా దీనిని ఆమోదించరాదు. గర్భాశయాలను అద్దెకివ్వడం ప్రోత్సాహనీయం కాదు'' అంటున్నాడు.

మరొక అధికారవ్యక్తి అభిప్రాయం ఇందుకు భిన్నం. ''అట్లా అనడం ఊహాజనిత భావన అనాలి. పదేళ్లనుంచీ ఈ పరగర్భవాహనం సరళి చూస్తున్నాను. తన గర్భాన్ని వేరెవ్వరో మోయడానికి, సర్వసాధారణంగా ఏ తల్లీ ఇవ్వదు. అట్లా ఇవ్వడం అత్యవసర పరిస్థితులలోనే జరుగుతుంది.''

ఏమైనా ఈ సమస్య కోర్టు తీర్పుల ద్వారా పరిష్కారం అయ్యేదికాదు. గర్భధారణకు సంబంధించిన సాంకేతిక విజ్ఞానము పరిష్కారాన్ని ప్రసాదించదు. విజ్ఞానవేత్తలు కొత్త కొత్త పద్ధతులు కనిపెడ్తూ ఉంటారు. ఈలోగా నైతిక ప్రశ్నలు పుంఖాను పుంఖం తల ఎత్తుతూ ఉంటాయి--ఎవరు సృష్టి కర్తలు?, ఎవరు అదుపు చేసేవారు?, ఎవరు హక్కుదారులు?--వగైరా వగైరా ప్రశ్నలు పుట్టూనే ఉంటాయి. విజ్ఞానశాస్త్ర ఫలితాలు ఒక వైపూ, నైతిక వివాదాలు ఇంకొకవైపు--కొనసాగుతూనే ఉంటాయి.

యిక పుట్టబోయే శిశువు భవిష్యత్తు ఎలా వుంటుంది. మానసిక వేదన, సంఘంలో అతనిస్థానము, యితరుల ఎత్తిపొడుపులు, మానసిక వత్తిడి మధ్యలో అతని జీవితం ఒక నరకప్రాయంగా మారే అవకాశాలున్నవి. తల్లి అనే పవిత్ర శబ్దము, మమకారము, కవులు సృష్టించిన ఆధ్యాత్మిక వాతావరణం, మతము, పురాణాలు మనపై ప్రసరిస్తున్న నిత్య జీవితం విలువలు, అన్ని తల్లక్రిందులవుతాయి. ఎలాంటి భవిష్యత్తులోకి ప్రయాణమవుతున్నామో అగమ్యగోచరంగా వుందా?

# ఆనందం పరబ్రహ్మేతి యోనిహి

— విష్ణు సహస్రనామం.

సర్వం మైథున మయం జగత్ అన్నట్లు సిద్ధాంతీకరిస్తారు మన మానసిక శాస్త్రవేత్తలు. సిగ్మండ్ ఫ్రాయిడ్ నుంచి చిన్న చిన్న పరిశోధకుల వరకు. స్త్రీ పురుషులు ప్రాథమిక వర్గాలు అన్ని జంతు జాలలో అందులో మానవజాతికి విచక్షణ, ఉద్రేకం, జిజ్ఞాస, అజ్ఞానం, అనురాగం, ద్వేషం, ప్రేమ, అసూయ అన్ని విధవిధాలుగా ప్రకటితమౌతూ వుంటవి. మానసిక శాస్త్రజ్ఞులు, కలలను కల్లలుగా భావించక వానిలో ఏవో నిగూఢ రహస్యాలున్నట్లు, అవి కలలు కన్నవాని ఆలోచనలు, ప్రయత్నాలు, ఆశలు - నిరాశలు నిస్పృహలను రహస్య లైంగిక కోరికలను తెలుపు ప్రత్యేకభాషగా భరిస్తారు. దానికి తండ్రి కూతురు, తల్లి కొడుకు, సోదరులు సోదరి మొదలగు లైంగికంగా నిషిద్ధ బందుత్వమున్నవారి పరస్పర అన్యోన్య ఆదరాభిమానాలను గూడ, ఒక విధంగా ఎక్కడో అంతర్భాగంలో నిగూఢంగా వున్న తలంపులుగా విశ్లేషణ చేస్తారు. ఇవన్నీ ఎంతవరకు ఆధారపడే యోగ్యత కలవో మనం నిర్ధారణగా చెప్పలేము. కాని మునుపు వలె సమాజాభివృద్ధిని గూర్చి అధ్యయనం చేసేందుకు సైకో అనాలిసిస్ చాల ముఖ్య సాధనమని ఈనాడు అందరు- మార్క్సిస్టులతో సహా- గుర్తించటం గమనించతగ్గ విషయం. ఇంతవరకు, ఏవో ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి సంబంధాలు, శారీరక అవసరాలు, ఆహారంవలె జన్మాంతరంగా వచ్చే గుణగణాలు, పిత్రార్జిత సమాజ విధానాలు అనే ఆలోచనా విధానాలుకాక మానసిక శాస్త్ర పరిశోధనల సహాయంకూడ తీసుకొనవలసి వుంది.

మానవుడు ప్రకటితం చేసే ఆలోచనలే గాక, తన రహస్య అంతరాత్మలో ఏవేవో ఊహల ప్రపంచంలో వుంటాడు. అదే బైట చెప్పడం సామాజికంగా అసభ్యం. తల్లి కొడుకుల మధ్య, తండ్రి కూతురు మధ్యవున్న సంబంధాన్ని కాస్త లైంగికంగా చూస్తే ''అబ్బ ఎంత చిరాకు, జుగుప్స, అసహ్యం! రామ రామ'' ప్రవరాఖ్యుడు వరూధినిని చూచి ''హా శ్రీహరీ'' అని కళ్ళుమూసుకున్నాడని పెద్దన చెప్పాడు. కాని పెద్దనే ఎలా ప్రవర్తించేవాడో! ఎంత 'ధీరచిత్తము'లైనా సతుల మాయలకు లొంగకపోవు. మహాత్మాగాంధి అంతటి మహాపురుషుడు తన ఆత్మ కథంతా చాల వరకు తన లైంగిక వికారాలను గురించే సత్యాన్వేషణలో చర్చించాడు. తిప్పి తిప్పి అదే 'పిచ్చివాడికి పింగుమీదె ఆలోచన' అన్నట్లు. ఆశ్రమంలో చాలామంది స్త్రీలు పనిచేసేవారు. వీరు రాజకీయాలలో జోక్యం చేసుకోలేదు. ఆశ్రమ శుశ్రూష, వారి అభిప్రాయాలు, గాంధీగారు వీరిని ఎలా మందలించారు, వారి స్వప్నాలను ఎలా నిర్వచనం చేశారు మొదలైనవి మానసిక శాస్త్రజ్ఞులకు చాలముఖ్యమనేది తెలుస్తుంది. ఎరిక్ ఎరిక్సన్ ''గాంధీ యొక్క సత్యము'' (Erik Erikson's, Gandhi's Truth) అనే గ్రంథంలో చాల

సుదీర్ఘంగా విశ్లేషించినాడు. సుధీర్ కక్కార్ గూడా తన పుస్తకంలో ఒక అధ్యాయమంతా గాంధీగారి ఆలోచనలు, ఆయనలోని లైంగిక చింతనలు, వికారాలు, ఇంద్రియస్ఖలనాలు, మీరాబేన్‌తో ఆయన ప్రవర్తన మొదలైనవంతా రసవంతంగా వర్ణించాడు. అంటే ఆయన చెప్పిందంతా సబబని కాదు. రసవంతమని మాత్రమే. తర్వాత మీరాబేన్ ముప్పై ఐదు సంవత్సరాల భారత వాసాన్ని త్యజించి స్విట్జర్లాండ్ లో నివసించిందని, ఆమెకు గాంధీ గారిపైనుండి స్వారస్యం పోయిందని తెలుస్తున్నది. (ఇది కొంతవరకు బాధ కలిగిస్తున్నది). అన్నిటికి ముఖ్యసాధనం బ్రహ్మచర్యమేనని గాంధీజీ వాదం. ఆయన సాధించిన మహత్తరమైన కార్యక్రమాలంతా దాని ప్రభావమేనా? (ఈనాటి భారతదేశాన్ని చూస్తే గాంధీ అనే ఒక మహామనీషి జన్మించాడా అనిపిస్తుంది. అది వేరే విషయం). ఒకని రాజకీయ జీవితాన్నంతా (ఒక్క బ్రహ్మచర్య దీక్ష ఫలితమేయని) చిత్రిస్తే కొంచెం సత్యదూరమేమో. ఒక గొప్ప విమర్శకుడన్నట్లు సిగ్మండ్ ఫ్రాయిడ్ కు ప్రపంచమంతా లైంగికకార్యం చుట్టూ భ్రమణం చేస్తుంది.

విశ్వాన్ని ఎవరుచుట్టి ముందొస్తారో వారికి ఫలమని పార్వతీదేవి తన ఇరువురు తనయులు - గణపతి, కుమారస్వామి - కి చెబితే బొజ్జ గణపతి మూషక వాహనంపై తల్లిచుట్టూ భ్రమణంచేసి ఫలగ్రహీతుడౌతాడు. ఇదికూడ ఒక "ఇడిపస్ కాంప్లెక్స్" అని విశ్లేషిస్తారు. గణపతి పార్వతిచ్చిన ఫల రసాన్ని గ్రోలుట తల్లి యొక్క చనుపాలు త్రాగడం వంటిదట! అలసాని పెద్దన నాందిలో ఇలాంటి వర్ణ నుంది. సుధీర్ కక్కార్ వినాయకుడు తన తుండాన్ని పందు కొరుకుతూ, తన యౌవనాన్ని పోగొట్టుకొని చిన్న శిశువుగానే పార్వతి స్తనాలను అంటబెట్టుకొని వుంటాడు అని గ్రంథకర్త అంటాడు. పెద్దన 'నాంది'లోని గూఢార్థము. అర్ధనారీశ్వరుని పార్వతిభాగంలోని స్తనంలో పాలు త్రాగుచూ, చిన్న శిశువుల అలవాడు మేరకు చేతితో, ఇంకొక స్తనాన్ని నులుముటకు ప్రయత్నిస్తూ దానిని కానక (అంటే ఆసగంలో శివుడుగదా) పాములే వున్నవిగనుక, కాస్త Confuse అవుతున్నటువంటి ఆ బాల వినాయకుని ప్రార్థిస్తున్నా నంటాడు.

ఈ అర్ధనారీశ్వర రూపంకూడ ఒక లైంగిక సమస్యే. స్త్రీ పురుష మిళితం పరమేశ్వర సృష్టి. మహిషాసుర మర్దనమే స్త్రీశక్తి నిరూపణ. అర్ధనారీశ్వర రూపం బాలునిలో వున్న ఒక మనోభావాన్ని చూపిస్తుంది. అదేమంటే, బాలుడు యౌవనుడవవలెనని కాని ఆ పరిణామంలో తన తల్లినుండి వేరుకాకుండ, పురుష స్వభావాన్నిపొంది, స్త్రీ స్వభావాన్ని విడనాడకుండు మనోభావము. ఇదంతా అతి తెలివి! అంతవరకు శాక్తం గురించి చెప్పకుండా వదిలాడు. పంచ 'మ' కారాల సహితం అందులో మాంసం అంటే పురుషుడు, మత్స్యం అంటే స్త్రీ అని ఇలా ఏదేదో అల్లుకుంటూ వెళ్లవచ్చు. నేనెందుకంటున్నానంటే, 'పాము' నుగూడ ఒక లైంగిక చిహ్నంగా చిత్రించాడంటే, ఇక చేపను వదలి పెడతాడా, మధువును గ్రోలుతు దానిని 'అధర సుధా రస'మనో లేక వీర్య విసర్జనం, దాన్ని......

స్వర్గీయ ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, ఎంకి పాటలను గురించి రాసిన పద్యం జ్ఞాపకం వస్తుంది.

పుస్తకం జాకెట్‌లో వున్న బొమ్మలు చూస్తేనే తెలిసిపోతుంది. ఖజురాహోలోని వ్యంగ్య శిల్పాలున్నవి.

జగద్విదితమైన కొక్కొక శాస్త్రము, వాత్స్యాయనుని కామశాస్త్రము, ప్రతి దేవాలయంలో బూతు శిల్పము (అయ్యా, తాతాజీ తాపీ దర్మారావు గారు, నీకు వేయి నమస్కారాలు వాటిని గూర్చి చెప్పినందుకు) దేవుళ్లే ఎల్లప్పుడు మైథున స్థితిలో నుందురని మత సిద్ధాంతము (విష్ణు వక్షస్థలంలో, అర్ధగా శివునిలో, నాలుకలో కూతురునే భార్యగా చేసుకున్న బ్రహ్మకు) చీమలో, బ్రహ్మలో శివకేశవాదులలో అనే త్యాగబ్రహ్మ యొక్క సంగీతంలో వెలసిన ఈ శృంగార రసప్రధానమైన భక్తి సాంప్రదాయంలో (అంటే కృష్ణుడే పురుషోత్తముడు అందరు మానవులు గోపికాస్త్రీలు) భారతదేశ సంస్కృతి అత్యున్నత స్థాయికి పోయిన ఈ దేశంలో, సామాన్య మానవులు, ప్రేమ శృంగారం అనే అతి కోమలమైన అనుభూతిని పొందక, ఏదో యాంత్రికంగా నడుచుకుంటారు. ముద్దు పెట్టుకోవడంకూడ తెలియని దాంపత్యాలు ఎన్నో! ఇదంతా మనసమాజంలో కొన్ని నిబంధనలు, స్త్రీల బానిసత్వం, లేకుంటే స్త్రీలు జీవితంలో చేసే ఎన్నో సంఘర్షణలు, పాతివ్రత్యం అనే దానికి చేసిన కొన్ని విపరీత అర్థాలు కారణాలు కావచ్చు. భాషా నిషేదాలు కూడ - అంటే ఉపస్థ అనే పేరులేక కొన్ని భాషలలో మూత్ర రంధ్రం అంటారట! (నా బొంద!)

చాల కేసులు చర్చిస్తాడు గ్రంథకర్త. భార్య భర్తలమధ్య కలహాలు, భర్తల అక్రమాలు, భార్యలు తద్వారా వేర్పాటైు, తమ ప్రవర్తనలోనే తీసుకొనే మార్పులు మొదలైనవి చర్చిస్తాడు. బీదలలో సుఖజీవనం వుంది; అన్ని కలతలు కష్టాలు మధ్యతరగతి కుటుంబాలలోనే వున్నవనేది అపోహ అని ఎన్నో దృష్టాంతరాలతో నిరూపిస్తాడు. మైథునక్రియ ఎన్నో కుటుంబాలలో మరుగు లేమిచే ఒక దొంగచాటుగా చేసే కర్మకాండగా, ఏలాంటి లాలించటం బుజ్జగించటం లేకుండా జరిగిపోతుంటది. ఇది వాత్సాయనుని దేశంలో, కృష్ణపరమాత్మ రాధతో, గోపికలతో తర్వాత సత్యభామతో మైథునకేళి (Love play) చేసిన ఈ భారతావనిలో!

ఇక మన సినిమా రంగంలో, జనపద వాఙ్మయంలో చాల వైపరీత్యాలున్నవి. సినిమాలో ముద్దు పెట్టుకోవడం నిషిద్ధమైన ఈదేశంలో స్త్రీని వస్త్రాపహరణం చేసి, నిర్బంధంగా వెరచటాన్ని ప్రయత్నిస్తున్న సన్నివేశాలు మాత్రం చాల తదేక దృష్టితో పరిశీలిస్తాం. "Dream-fantasy" (స్వప్న అతిశయ కల్పన) అన్ని కుటుంబాలలో వున్న సంబంధ బాంధవ్యం సంస్కృతికి అతీతమై రహస్యంగా- నిషిద్ధం అని పరిగణిస్తామో దానిని- అణిగిమణిగి పైకి ప్రకాశితం చేస్తుందంటాడు. ఈ కథలన్ని ఈ సూత్రాన్ని రుజువు చేసేటటువంటివే. రేప్ (Rape) లో అన్ని విధాలుగ బాల్యంలో తన్ను అణిచిపెట్టే అమ్మ

శృంఖలాలనుండి విముక్తి చెందటమనే తాత్కాలిక భావమున్నందువల్ల, అట్టి సర్వశక్తి వంతమైన తల్లిని లొంగదీయడ మనే భావం రేప్‌లో వుంది. అందుకే భారతీయులకు రేప్ అంటే అంత ఇష్టం!

పిచ్చికి తెలివికి మధ్య సన్నపొర. ఊహా ప్రపంచంలో ఎన్నెన్నో పిచ్చి దృశ్యాలు, తలంపులు, బైటికి చెప్పుకోజాలని ఆశలు వైపరీత్యాలు. వీటికితోడు ప్రతిసమా జంలో ఆ సమాజ కాలదేశ పరిస్థితుల ననుసరించిన అలవాట్లు, పద్ధతులు, నిషే ధాలు. కాని మనస్సు మర్కటం కదా. నిద్రపోగానే అణిగివున్న ఆ మర్కటం లేస్తుంది. అవే కలల రూపంలో వస్తవని నమ్మకం. అసలు మనం నిద్రావస్థలోనికి వెళ్ళి వెళ్లకముందే కలలు ప్రారంభమౌ తవి. ఎన్నో మనకు జ్ఞాపకముండవు. స్వప్న రహితమైన గాఢనిద్ర పోయాన నటం కల(ల్ల). జంతువులు, ఆదిమ వాసులు కలలు కంటారు గదా! వారి కలలు మనకలల వలె వుండటానికి వీలు లేదు. వాని అనుభవానికి, వాని ఊహా శక్తికి అతీతంగా వుండలేవనుకుంటాను. భయంకర స్వప్నాలు (Nightmares) నిద్రావస్థలో నడచి వెళ్లటం మొదలైనవన్ని లైంగిక సమస్యలేనా? మానవునికి లైంగిక సమస్యలు తప్పవేరు ఆశలు, భయాలు, సంతోషాలు, దుఃఖాలు లేవా? ప్రపంచ మంతా ఉపస్థ చుట్టు భజన చేసే ఉపగ్రహ బృందాలా? భారతదేశంలోని ఇంద్రియ నిగ్రహణకు గల ప్రాముఖ్యత, కామ శాస్త్రా నికున్న ప్రాధాన్యత, పాశ్చాత్య శాస్త్రజ్ఞు లకు వారి అనుచరులకు ఒక పెద్ద క్లిష్ట సమస్య. ఈ పుస్తకం నిరూపం.

ప్రొ. కె. శేషాద్రి

"యాగము చేసిన విప్రుడు
భోగించును రంభతోడఁ బుత్రుడు మరలన్
యాగంబు చేయఁ దల్లిని
భోగించుటె కాదె యజ్ఞ పుణ్యము వేమా".

"ఆ. పునుఁగు పిల్లికేల పుట్టించె వాసన?
కనకము తనకేమి కల్లఁజేసె?
బ్రహ్మచేఁతలెల్ల పాడైనచేఁతలు..."

# సంక్షుభిత నైతికవాది మొరావియా

— అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

ఒక రాజు మరణించాడు
ఒక తార నేల రాలింది
ఒక కవి మరణించాడు
ఒక తార నింగి కెగసింది

ప్రపంచ ప్రఖ్యాత ఇటలీ నవలా రచయిత ఆల్బర్ట్ మొరావియా గత మాసం రోమ్‌లో టైబర్ నది ఒడ్డున ఉత్తరపు మలుపున ఉన్న తన స్వగృహంలో గుండె పోటుతో 82వ యేట మరణించాడు. అతడు మరీ అగ్రశ్రేణి నవలా రచయిత కాకపోయినా — అంటే ఏ డాస్టొవిస్కీ-యో, టాల్‌స్టాయ్‌ల సరసన నిలబెట్టడానికి వీలులేకపోయినా, — ప్రపంచానికి అంతగానో ఇంతగానో తెలిసిన రచయితే. చిరకాలం నిలిచే రచయితలలో ఒకడే. అందుకని సాహితీ వినీలాకాశంలో మిణుకు మిణుకు మనే తారగా అయినా అతడు భావి తరాలకు దర్శన మిస్తాడు.

ఏ రచయిత అయినా తన సమకాలీన ప్రపంచాన్ని నిశ్వసించి, తనదైన ఒక దృక్పథంతో పరిశీలించి, ఆత్మాభివ్యక్తీకరణం చేసుకొంటాడు. మొరావియా గూడ ఇందుకు భిన్నం కాదు. అతనిని మూడు జాడ్యాలు పట్టుకు పీడించాయి. అవే అతని రచనలలో దర్శన మిచ్చాయి. మొదట్లో ఆ జాడ్యాలు అంకుర రూపంలో మాత్రమే అతని రచనలలో కనిపించి, తరవాత తరవాత రచనలలో అవి మహావృక్షాలై విలసిల్లాయి. అంతే కాదు, యుద్ధానంతర రోమ్‌ను, రోమ్‌నే కాదు ఆధునిక ప్రపంచాన్ని పట్టుకు పీడిస్తున్న బాహిరత- పరాయితనం-ను గూడ తన రచనలలో వ్యక్తీకరించాడు.

ఆ మూడు జాడ్యాలు ఇవి: సెక్స్, నిరాసక్తత (దేనినీ పట్టించుకోక పోవడం), డబ్బు. ఈ మూడూ వాస్తవంలో సమకాలీన ఇటలీ సమాజాన్ని — ఆ మాట కొస్తే ఏ సమాజాన్నైనా — పట్టుకు పీడిస్తున్నవే. దీనికి తోడు లంచగొండితనం నర నరాన పాకిపోయింది. ఈ సమకాలీన రుగ్మతా ప్రపంచ నీతిని అతడు దున్ని వదిలి పెట్టాడు. వీటిపై అవిరామంగా, అలసట లేని దీక్షతో దాడి చేశాడు.

జీవితానుభవాలకు రచనలకు సంబంధం ఉంటుందని ఇంతకు ముందే చెప్పుకోవడం జరిగింది. అతడికి తొమ్మిదవ యేట క్షయ వ్యాధి సోకింది. దాదాపు అయిపోయాడే అనుకొన్నారు. కాని ఎలాగో బ్రతికి బయట పడ్డాడు. దాని కోసం అతడు ఐదేళ్ళ పాటు శానిటోరియమ్‌లో చికిత్స పొందాడు. బహుశ అతడి జీవితం తరవాత తరవాత అలా రూపొందడానికి, అతడి రచనలు ఆ ఆకృతి దాల్చడానికి బాల్యంలో అతడి మీద పడిన నిరాశావహ అనుభవాలే అయి ఉండాలి. ఈ అనుభవాలకు మరొక రచయిత ప్రభావం కూడా తోడైంది. ఆ కవి ఫ్రాన్స్ దేశానికి చెందిన చార్లెస్ బాడెలేర్.

అసలు ఈ మూడు జబ్బులు బాడెలేర్ నుంచి సంక్రమించినవే. అయితే అవి మోరావియాకు యథాతథంగా దిగుమతి కాలేదు. ఒక తేడా ఉంది. బాడెలేర్ 'నిరాసక్తత'ను హీన స్థాయి లోనే, అంటే దిగజారుడు తనానికి ప్రతీకగా వర్ణించినా, అది అతని రచనలలో ఒక రకమైన విరోధా భాసిక (Paradoxical) ఉన్నతాన్నే ప్రతిబింబించింది. కాని మోరావియాలో అదే నిరాసక్తత ఒక నవలలో కంటె మరో నవలలో ఇంకా ఇంకా దిగజారుడు తనానికి ప్రతిబింబమైంది. ఉదాహరణకు అతడు 1929లో వ్రాసిన ''నిర్లిప్తతా కాలం'' (The Time of Indifference) అనే నవలలో నాజీల కాలంలో మధ్య తరగతి పతనాన్ని వర్ణించాడు. ఈ నవలలో మైకల్ అనుభవించిన నిరాసక్తత, నిర్లిప్తత, ఉదాసీనతల కంటె, 1960లో వ్రాసిన ''ఖాళీ కాన్వాస్'' (Empty Canvas) అనే నవలలో నాయకుడు డీనో ఇంకా, ఇంకా ఎక్కువ మోతాదుల్లో ఔదాసీన్యాన్ని గాఢంగా, లోతుగా అనుభవిస్తాడు. ఈ ఖాళీ కాన్వాస్‌లో నిరాసక్తత ప్రతి వస్తువును సోకింది. ఏ వ్యక్తికైనా తనను గురించి తనకు బాగా తెలుస్తుంది. అటువంటి తనకూ సోకింది ఆ నిరాసక్తత. ఎదుటి ప్రపంచాన్ని గురించి మనిషికి తెలిసింది చాల తక్కువ. అటువంటి అంతంత మాత్రం తెలిసిన ప్రపంచాన్ని గూడా సోకింది.

'నిర్లిప్తతా కాలం' అనే నవలలో ''మానవుని దురవస్థ'' (Human predicament) వర్ణితమైంది. ఈ దురవస్థ నుంచి మానవుడు తన సంకల్ప బలంతో, ఇచ్ఛాపూర్వకంగా తప్పించుకోలేని అశక్తత, నపుంసకత్వం వర్ణితమైంది. అసలు ఈ 'మానవ దురవస్థ' అనే అస్తిత్వవాద సమస్యను డాస్టోవిస్కీ ''కరమ్‌జోవ్ సోదరులు'' (The brothers Karamzov) అనే నవలలో చిత్రించి అస్తిత్వవాదానికి ఒక రకంగా శ్రీకారం చుట్టాడు. డాస్టోవిస్కీ ప్రభావం తనపై ఎంతో ఉందని మోరావియా చెప్పుకున్నాడు. అందుకే ఖాళీ కాన్వాస్‌లో ఈ అస్తిత్వ వాద ఛాయలు బాగా కనిపిస్తాయి.

బాడెలేర్ లాగానే, ఇతడూ, నిరాసక్తతను సంపన్న సమాజానికి పట్టిన పీడగా చర్చించాడు. అతడికి వలెనే ఇతడూ లైంగిక క్రియను వర్ణించాడు. వ్యక్తుల మధ్య అధికారం కోసం పెనుగులాట ఏఏ మార్గాలను తొక్కుతుందో, అవే మార్గాల తొక్కిసలాటను మనం సెక్స్‌లోనూ దర్శిస్తామంటాడు మోరావియా. అసలు, మోరావియా, లైంగిక క్రియను అనాస్తకత నుంచి జనించిన భీతికి ప్రతీకగా పరిగణించాడు.

ఇటలి సమాజం నిచ్చెన మెట్ల సమాజమే. అటువంటి సమాజంలో దిగువ మెట్టుకు చెందిన జీవితాన్ని గురించి 'రోమ్ మహిళ' (The woman of Rome) అనే నవలలో వర్ణించాడు. ఈ నవలలో యుద్ధానంతర రోమ్ నగరంలో 'నిజమైన ప్రేమ' కోసం అశ్రులు సాచే, ఆక్రోశించే ఒక వేశ్య జీవితాన్ని చిత్రించాడు. ఈ నవల ఆయనకు ప్రపంచ విఖ్యాతిని ఆర్జించి పెట్టింది. మన దేశంలో, ప్రపంచంలో, ఈ నవలను ఎక్కువగా చదివారు. అయితే ఇతడు ఇటువంటి బదుగు జీవితాలను గురించి

ఎక్కువ రచనలు చేయక, తాను ఏ ఉన్నత సమాజానికి చెందాడో, ఆ సమాజాన్ని చిత్రిస్తూ మాత్రమే ఎక్కువ రచనలు చేశాడు.

అతడి తండ్రి యూదు: వాస్తు శిల్పి. తల్లి ఉన్నత వంశ సంజాత. ఆ సమాజాన్నే జీర్ణించుకొన్నాడు. దానినే చిత్రించాడు.

1945లో అతడు రోమ్ పునరాగమనం చేశాడు. ఆ సమయంలో అతణ్ణి నాజీ రహస్య పోలీసు అరెస్టు చెయ్యాలని చూసింది. ఆ కారణంగా అతడు తన మొదటి భార్య, నవలా రచయిత్రి అయిన ఎల్సా మొరాంటాతో, రోమ్‌కు నేపుల్స్‌కు మధ్య ఉన్న ఫొండీ పర్వత శివార్లలో తల దాచుకొన్నాడు. అక్కడ పశు కాపర్లతో జీవితం గడిపాడు. పశుశాలల్లోనే నిదురించాడు. అయితే ఈ అనుభవాలను పురస్కరించుకొని, ఆ తరవాత అతడు 1957లో "ఇద్దరు స్త్రీలు" (The two women) అనే బ్రహ్మాండమైన నవల వ్రాశాడు. దీనిని తరవాత సినిమా తీశారు. ఈ సినిమాలో సోఫియా లారెన్ లాంటి ప్రసిద్ధ నటి నటించింది. దీని కథా కాలం 1943. అప్పుడు బాంబులు పడుతున్న రోజులు. ఈ నవలలో ఒక షాపు నడుపుకొనే మధ్య వయస్కురాలైన వితంతువును, ఆమె కూతురును రోమ్ విడిచి వెళ్ళవలసిందని బలవంతం చేసిన కథను, వారు వంచితులైన తీరును వర్ణించాడు.

ఇతడి నవలలన్నింటిని దాదాపుగ సినిమా తీశారు. వాటిల్లో పెద్ద పెద్ద కొమ్ములు తిరిగిన నటీ నట వర్గం పాల్గొంది. బ్రిగెటీ బార్డట్, జినాలొలొబ్రిగిడా, సోఫియా లారెన్, ఇంగ్రిడ్ తులన్ లాంటి వారు నటించారు.

1960ల్లో వచ్చిన సెక్స్ విప్లవానికి అనుగుణంగానే ఇతడి రచనల మీద ఆధార పడి తీసిన ఆయా సినిమాల్లో నగ్నత్వం వివిధ మోతాదుల్లో ప్రదర్శితమైంది. అతడి నవలలకు అశ్లీలతా ముద్ర పడింది. కాని అతడెప్పుడూ, తనను ప్రభావితం చేసిన వారు ప్రౌస్ట్, బాల్‌జాక్, డాస్టొవిస్కీ అంటాడు. మరి అలాంటప్పుడు వాటిని అశ్లీలతా కోణం నుంచి కాక మరో కోణం నుంచి చూడాలేమో? అయితే 1971లో అతడు ప్రచురించిన "The two of us" — ఒక లైంగిక హాస్య వ్యంగ్యోక్తి నవలను చూస్తే, వాస్తవంగా నాటి ఇటలీలోని 'నీలి' సినిమాల ప్రభావం అతనిపై పడ్డట్టు కనిపిస్తుంది. ఈ నవలలో ఒక వ్యక్తికి, తన రహస్యాంగంతో తనకున్న అసంతోషకర సంబంధాన్ని చిత్రించాడు. డెబ్భైల చివరలో అతడి రచనలలో స్త్రీతో-స్త్రీ రతి (Lasbianism), సామూహిక లైంగిక కార్యకలాపాలు (Group sex), గుదరతి (Sodomy) ఎక్కువగా చోటు చేసుకొన్నాయి.

అయితే ఆ తరవాత, అంటే 1980లలో, మరో నూతన అంశం అతడి రచనలలో స్థానం సంపాదించింది. అది బాంబు. అతడు ఇటలీ కమ్యూనిస్టు పార్టీలో ప్రముఖుడు. ఏకపక్ష నిరాయుధీకరణ ప్రతిపాదనను సమర్థించాడు.

1985లో 'దర్శనలాలసుడు' (The Voyeur) అనే పేరుతో, అణుబాంబుల

దాడి వలన అనర్థాలను వర్ణిస్తూ ఒక నవలను ప్రకటించాడు. దర్శన లాలసుడు అంటే ప్రచ్ఛన్నంగా, తలుపు రంధ్రాలలో నుంచి, ఇతరులను నగ్నంగా లేదా వారు రతి కార్యంలో ఉన్నప్పుడు చూడడం ద్వారా కామతృప్తి పొందేవాడు. ఇటొక మత్తు కలిగించే నవల. దీని నిండా లైంగిక ప్రతీకలు కోకొల్లలు.

అతడు మొత్తం 30 నవలలు వ్రాశాడు. వీటిలో అన్నీ కాకపోయినా, ముఖ్యంగా ''ఇద్దరు స్త్రీలు'', ''ఖాళీ కాన్వాస్'', ''మధ్యాహ్నం దయ్యం'' (A Ghost at Noon) లాంటి కొన్ని రచనలు సమకాలీన ఇటలీ సాహితీ ఆకాశంలో అతడికి చెక్కు చెదరని స్థానాన్ని ఆర్జించి పెట్టాయి.

ఇటలీ లంచగొండితనంతో భ్రష్టు పట్టి పోయింది. మైలపడి పోయింది. ఆ మైలను ఉతికి మడి బట్ట చేయడమే తన లక్ష్యంగా పెట్టుకొన్నాడు. కాని ముసోలినీ సోదరుడు, ఇతడిని గురించి, ''ప్రతి మానవ విలువను నాశనం చేశాడు'', అని ఒక ఏటు వేశాడు. దాంతో అతడి నవలలన్నీ సెన్సారు కత్తెరను ఆకర్షించాయి. ఆ కత్తెర అవధానం నుంచి అవి తప్పించుకో లేకపోయాయి.

ఇటలీ సాహితీ విమర్శకులలో అత్యంత ప్రతిభావంతుడైన, గణుతికెక్కిన జి.ఎ. బోర్గిస్, మోరావియాకు ఒక ధృవ పత్రం ఇచ్చాడు. ''మోరావియాను సృజనాత్మక ప్రతిభావంతుడు (Creative genius) అన్నాడాయన. అలాంటి విమర్శకుడు అలా చెప్పిన తరవాత అతడి సాహితీ విలువలను గురించి ఎవరూ శంకించ వలసి పనిలేదు. చాలమంది విమర్శకులు అతడి రచనలలోకెల్లా, అతడు 1944లో వ్రాసిన ''అగొస్టైన్'' (Agostine)ను ఉత్తమ రచనగా అంగీకరించారు. ఇది ''శైలి'' పరంగా గూడ ప్రతిభావంతమైంది. అంతిమ ప్రేమ (Final love) క్షయీకరణాన్ని అభివర్ణించే, మన అనుభూతులను అతిపదునైన సూదులతో గకావికలు గావించే, తీవ్ర విమర్శక నవల ఇది.

అతని మరణానికి నటాలయా జిన్జ్ బర్గ్, ఎంజో సిసిలియానో లాంటి, ఇంకా అనేక అగ్రశ్రేణి రచయితలు శ్రద్ధాంజలి ఘటించడానికి రావడంతో ఆయన గృహం యాత్రా స్థలమైపోయింది. ''ఇరవయ్యో శతాబ్ది ఇటాలియన్ సమాజాన్ని — దాని వైరుధ్యాలతో, విగోదాళాన లతో, కలకలాలతో, వి...ల కోసం పరితపించే వ్యాకులతలతో- మోరావియా బహు సున్నితంగా, చాల తీవ్రంగా విమర్శించాడు'', అన్నాడు ఇటలీ ప్రెసిడెంట్ ఫ్రాన్సెస్కో కోసిగా ఆయన మరణంపై సంతాపాన్ని వెలువరిస్తూ. మొత్తం మీద, మానవుని పాశవికత, క్రౌర్యం, దుర్మార్గాలు అతని ఆత్మను సంక్షుభితం చేశాయి. అందుకే అతడు ''మైల''ను వీరసేనానిలా ఎదుర్కొన్నాడు. ఖాళనం చేశాడు. ఇటలీ నాగరికతను సుసంపన్నం చేశాడు.

''నా జీవితమూ అందరి జీవితాల్లా సంక్షుభితమూ, గందరగోళమూ, గజిబిజీను. అయితే ఈ గజిబిజిలో సర్వత్రా ప్రవహించే 'దారం' సాహిత్యం'' — అని తన ఆత్మ కథలో చెప్పుకొన్నాడు మోరావియా.

# మేధావిగా సంజీవదేవ్

డా॥ ఎన్. ఇన్నయ్య

సంజీవదేవ్ స్వేచ్ఛగా ఆలోచిస్తారు. తమ ఆలోచనల్ని ఇతరులకు అందిస్తారు. ప్రవాహంలో కొట్టుకపోకుండా జీవితాన్ని గురించి మననం చేస్తారు. ఎక్కువ మంది గుడ్డిగా నమ్మేవాటిని విధిగా నమ్మాలనే ధోరణి ఆయన పాటించరు. విచక్షణతో బేరీజు వేసి యుక్తాయుక్తాలు చూసి నిలబడగలవాటినే స్వీకరిస్తారు. లేనివాటిని తోసి పుచ్చకుండా, పరీక్షకు నిలిస్తే ఒప్పుకుందాం అంటారు. ఇవన్నీ ఆధునిక మేధావి లక్షణాలే. అందుకే సంజీవదేవ్ మేధావి.

భారతదేశంలో పూర్వం ఉద్దాలకుడు వంటి బహుకొద్ది మంది ఆలోచించి ఇతరులను ఆలోచింపజేశారు. ప్రశ్నించడాన్ని ప్రోత్సహించారు. కాని అలాంటివారు మైనారిటీ గానే నాడు మిగిలిపోయారు. ఆ కోవకు సంజీవదేవ్ చెందుతారు. ఇందుకు భిన్నంగా యాజ్ఞవల్క్య వంటివారు పెత్తందారీ తనంతో ఆలోచనా రంగాన్ని పరిపాలించారు. ప్రశ్నిస్తే సహించ లేదు. తాము చెప్పింది ''వేదం'' అనే ధోరణి కనబరచారు. భారతదేశం యాజ్ఞవల్క్య సంప్రదాయాన్ని అనుసరించింది. మన వెనుకబడిన తనానికి అదొక ప్రధాన కారణం. వారి సంఖ్య అత్యధికంగా వున్నది. నియంతృత్వాలకు దారితీసిన ధోరణులు యాజ్ఞవల్క్య ఆలోచనలలో వుండగా స్వేచ్ఛను ప్రోత్సహించే విధానాలు ఉద్దాలకుడులో కనిపించాయి. సంజీవ్‌దేవ్ రెండో మార్గాన్ని అనుసరించిన మేధావి. ఇది ప్రవాహానికి ఎదురీదడమే. అయితే సంజీవ్‌దేవ్ చెప్పే ధోరణి ప్రసన్నంగా లాలిత్యంగా వుండడం వలన, కాఠిన్యం పైకి కనిపించదు. అందుకు ఆయన అనుసరించిన శైలి, భాష బాగా తోడ్పడినాయి.

ఆధునిక భారతదేశంలో యాజ్ఞవల్క్య సంప్రదాయాన్ని పాటించిన గాంధీ, మహాత్ముడుగా స్వీకరించబడినాడు. ఉద్దాలకుని పద్ధతిని పాటించిన మానవేంద్రనాథ్ రాయ్, రామ మనోహర్ లోహియా, బి.ఆర్. అంబేడ్కర్ వంటివారు మేధావులుగా మైనారిటీ వర్గంలో మిగిలిపోయారు. సంజీవ్‌దేవ్ యీ రెండో వర్గంలో అంతర్లీనంగా పయనం సాగించారు.

మేధావులు ఆలోచించి, చెప్పినట్లు, జీవితంలో అనుసరించాలా అనేది పెద్ద సమస్య. ప్రపంచ మేధావులుగా కీర్తి పొందిన వారిలో వైవిధ్యం కనిపిస్తున్నది. కారల్‌మార్క్స్, బెర్‌టోల్డ్ బ్రెట్, విక్టర్ గోలాంజ్, ఛాంస్కీ, హెల్‌మన్, షెల్లీ, రూసో, సార్త్రే, హెమింగ్‌వే, టాల్‌స్టాయ్ వంటి మేధావులు ఎందరినో ప్రభావితం చేశారు. కాని వారి జీవితాలు పరిశీలిస్తే కొన్ని సార్లు ఆశ్చర్యపరచే సంఘటనలు కనిపిస్తాయి. చెప్పిందానికి విరుద్ధంగా ప్రవర్తించిన విషయాలు మనల్ని దిగ్భ్రాంతుల్ని చేస్తాయి. వీరి భావాలు మాత్రమే

తెలుసుకొని, వారి జీవితం గురించి కళ్ళు, చెవులు మూసుకుంటే మంచిదనిపిస్తుంది. అయితే, ఆయా మేధావులు చెప్పిందే స్వీకరించాలి గాని వారేం చేశారో మనకు అనవసరం అనే వాదన లేకపోలేదు. ఇది చర్చనీయాంశం. సంజీవదేవ్ ఇలాంటి మేధావి కాదు. జీవితాన్ని ఒక కళగా, విలువగా పరిగణించి, పాటించిన మేధావిగా సంజీవదేవ్ జీవితం వుంటుంది. అది పెద్ద విశేషం. అంటే మేధావులలో కూడా సంజీవదేవ్ మైనారిటీ వర్గానికి చెందిన వాడే నన్నమాట. అలాంటి మేధావి ఆలోచనలు, భావాలు ఎలాంటివో సూచాయగా చూద్దాం. విడమరచి పరిశీలించే పని పాఠకులకు వదిలేద్దాం.

## మిస్టిక్ లక్షణాలున్నాయా?

నా మిస్టిసిజం, నార్లనాటి రేషనలిజం అంటూ సంజీవదేవ్ రూపారూపాలలో (1969) ప్రస్తావించారు. దీనిని బట్టి సంజీవదేవ్ మిస్టిక్ అని నిర్ణయానికి వస్తే కష్టం. తాత్వికంగా మిస్టిసిజానికి రూఢి అర్థం వున్నది. దైవంతో ప్రత్యక్ష సంబంధం ఏర్పరుచుకుంటున్నట్లు, అదే అసలైన వాస్తవమనీ, మిగిలిందంతా కాదనీ మిస్టిక్స్ ప్రవర్తించారు. అన్ని మతాల్లో మిస్టిక్స్ ఒకలాగే వున్నారు. వీరి ధోరణి విశ్లేషణకు అందదంటారు. కొంతకాలం నిరాశ, నిస్పృహాలతో బ్రతికి, చివరకు ''వాస్తవాన్ని'' లోతుపాతులతో ప్రత్యక్షంగా కనుగొన్నట్లు మిస్టిక్స్ చెబుతారు. అలాంటి వాస్తవం అనిర్వచనీయం అంటారు. కాలాన్ని వీరు త్రోసిపుచ్చారు. జెన్ (ధ్యాన) బౌద్ధం, తావోయిజం, యూదులలో కాబలిస్టులు, హసిడం, ఇస్లాంలో సూఫీలు, క్రైస్తవులలో క్వాకర్స్, హిందువులలో కొందరు మార్మిక సాధువులు మిస్టిక్ కోవకు చెందినవారు. సంజీవదేవ్, యీ మతపరమైన, సంప్రదాయ మిస్టిసిజానికి చాలా దూరం కనుక రూపారూపాలలో తనను మిస్టిక్‌గా పేర్కొన్నప్పుడు, ప్రకృతిని ''ఆరాధించే'' మిస్టిక్ అనుకోవాలేమో. కొన్ని సందర్భాలలో ఆయన కచ్చితంగా, అరమరికలు లేకుండా తనను నిర్వచనాలలో యిరికించడాన్ని తృణీకరించారు. తాను ఆస్తికుడిని, నాస్తికుడిని, ఇంకా అలాంటి వేవీ కాదని స్పష్టం చేశారు. కనుక మిస్టిక్ అనేది వాడుక అర్థంలోగాని, రూఢి అర్థంలోగాని సంజీవదేవ్‌కు వర్తించదు. మేధావిగా ఆయన ప్రతిదీ విడమరచి, తరచి చూచిన తీరు గమనిస్తే, మిస్టిసిజపు అనిర్వచనీయ ధోరణికి ఎదురీదారు కనుక సంజీవదేవ్ మిస్టిక్ అని భ్రమించడం అనవసరం. బహుశా పరిణామ క్రమంలో తాను మిస్టిక్‌ను కాదని కూడా సంజీవదేవ్ వెల్లడించారు. (1972 తపస్వికి లేఖ).

## మేధావి లక్షణాలకు ఉదాహరణలు

లింగం వీరభద్రయ్య చౌదరి పుస్తకాన్ని సమీక్షిస్తూ సంజీవదేవ్ ''సమీక్షా రేఖలు'' అనే చిన్న గ్రంథంలో ''చౌదరి గారు నాస్తికులందు అయిష్టత వ్యక్తపరచారు. ఇది యుక్త వైఖరి కాదు. ఎందరో గొప్ప గొప్ప వారంతా విశ్వసించారు గనుక ఆ సత్యాన్ని మనం కూడ విశ్వసించాలనడం ఒక విధంగా భావదాస్యమే అవుతుంది. అధిక సంఖ్యాకులు నమ్మింది మాత్రమే సత్యం, గొప్పవారు నమ్మింది మాత్రమే సత్యం అని నమ్మటం సత్యానికి

దూరం కాకూడదని ఎక్కడాలేదు''. సంజీవదేవ్ ఇలా రాయడంలో శాస్త్రీయ దృక్పథాన్ని అనుసరించారు. పదుగురాడు మాట పాటియై ధర చెల్లుతున్న రోజుల్లో, ప్రవాహానికి ఎదురీది, తాను నమ్మింది, శాస్త్రీయం అనుకున్నది చెప్పడం మేధావి లక్షణం.

నేడు పది మందీ గుడ్డిగా అనుకరిస్తూ, ఆరాధిస్తూ, నినదిస్తున్న జాతీయవాదం కూడా సంజీవదేవ్ తృణీకరించారు. మనకు కావలసింది రేషనలిజం అని చెప్పారు. (1965 అరుణకు లేఖల్లో సంజీవదేవ్) అంతటితో ఆగక మానవత కావాలని అన్నారు. ఆయన రచనల్లో అంతర్లీనంగా యీ ధోరణి బాగా కనిపిస్తుంది. మనదేశంలో జాతీయవాదానికి స్వాతంత్ర్యానంతరం కాలదోషం పట్టింది. ఈ విషయాన్ని గ్రహించి ఎం.ఎన్. రాయ్ తన రచనల్లో, జీవితంలో జాతీయవాదాన్ని ఖండించి, దాని ప్రమాదాలను చూపి, మానవత ఆవశ్యకత నొక్కి చెప్పారు. అలాంటి మేధావులు మన దేశంలో అరుదు. జాతీయవాదానికి వ్యతిరేకంగా మాట్లాడితే దేశద్రోహి అనుకునే ఉద్రేక వాతావరణం ప్రబలి వున్నది. ఇది క్రమేణా సడలి, పూర్తిగా పోవాలి. సంజీవదేవ్ వంటివారు చెప్పే సరళి యిందుకు తోడ్పడవచ్చు.

దేవుడు వున్నాడా లేడా అని చర్చించే బదులు, చారిత్రకంగా వాస్తవాన్నే సంజీవదేవ్ అరమరికలు లేకుండా బయటపెట్టారు. దేవుడు అనేది ఉనికిలో రుజువుకు నిలబడే తీరులో ఎక్కడా జాడ లేదన్నారు. కాగా, ఆయా ప్రవక్తలు, రుషులు, వ్యక్తులు తమ దైవాన్ని సృష్టించి, జనం మీదకు వదిలారు. వాటిని వాస్తవాలని సామాన్య జనం నమ్మి ఆరాధిస్తున్నారు. సంజీవదేవ్ అవగాహన చక్కగా ఉంది. (బయోసింఫనీ).

ఇలా వివిధ అంశాలను, విషయాలను హేతుబద్ధంగా ఆలోచించి, మన ముందుంచిన సంజీవదేవ్ అంటారు — ''ఆలోచించక పోవడం చాలా కష్టమైనపని. ధ్యానం అంటే నిత్యజీవితాన్నుంచి వేరుపడి ఏ కొద్ది క్షణాలో అనుభవించేదిగా వుండకూడదు'' యోగం పేరిట చిత్త వృత్తి నిరోధం చేసి, ఆలోచన చంపి, మనుషుల అమాయకత్వాన్ని వాడుకొని, అజ్ఞానంపై వ్యాపారం చేయాలనే వారికి మేధావిగా సంజీవదేవ్ చెంపపెట్టు ఇంతకంటే ఏంకావాలి! (తేజోరేఖలు)

స్వేచ్ఛ కంటె మానవుడికి అత్యుత్తమ విలువ లేదంటూ, సాపేక్షికంగా బాధల నుండి విమోచన పొందడం కావాలని ఆల్డస్ హక్స్లీకి రాసిన లేఖలో పేర్కొన్నారు.

ప్రపంచంలోని అనేక మంది మేధావులను సంజీవదేవ్ పరిశీలించి, వారి గురించి లోకానికి చెప్పారు. బెర్ట్రాండ్ రసెల్, రామమనోహర్ లోహియా, నరేంద్రదేవ్, రాహుల్ సాంకృత్యాయన్, ఆనందకుమార స్వామి, ఎం.ఎన్. రాయ్, రవీంద్రనాథ్ ఠాగూర్, జిడ్డు కృష్ణమూర్తి — ఇలా సంక్షిప్త జాబితా ఉన్నది.

• ప్రకృతి, మానవుడు పట్ల స్పష్టమైన అవగాహన, ఆలోచన వుండడం మేధావి మరో లక్షణం. ఆ దృష్ట్యా అనేక శాస్త్రీయాంశాలను సంజీవదేవ్ పరిశీలించారు. భిన్న కోణాల నుండి మానవుడిని అధ్య

యనం చేశారు. మానవుడిని అర్థం చేసుకోడానికి ఆధునిక మనోవిజ్ఞానం అవసరం. సంజీవదేవ్ యీ శాస్త్రాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తున్నా రనడానికి ఆధారాలు వున్నాయి.

## సైకాలజీ

ఫ్రాయిడ్ , ఏడ్లర్, యూంగ్‌ల సైకాలజీ పట్ల దృష్టి పెట్టి చూచిన సంజీవదేవ్ నిర్దుష్టమైన అభిప్రాయాలు వెల్లడించారు. ఫ్రాయిడ్ సైకాలజీని తమోగుణ ప్రధానంగా, ఏడ్లర్ రజోగుణంతో వున్నట్లూ, యూంగ్ సత్వగుణాధిక్యతతో వున్నట్లు జడ్జిమెంట్ ఇచ్చారు.

సైకాలజీలో ఫ్రాయిడ్ ప్రతిభ గురించి, దోషాల్ని గురించి ఎరిక్‌ఫ్రాం రాశారు. ఇంకా అనేక పరిశీలనలు వెలువడ్డాయి. ఫ్రాయిడ్ గొప్పతనంలో స్వప్నాల విశ్లేషణ. వాటి ప్రభావం, వాటిని చైతన్యావస్థలోకి తెచ్చిచూడడం అనేవి గొప్ప పరిశీలనలుగా గుర్తించారు. జ్ఞాపక శక్తి విషయంలో అంతకు ముందున్న సిద్ధాంతాలను కాదని, ఫ్రాయిడ్ చేతన, అచేతనావస్థల్ని చెప్పాడు. కావాలని అణచి వేసిన అనేక విషయాలు స్వప్నాల రూపేణా, ఇతరత్రా, ఎలా ప్రభావితం చేస్తాయో ఫ్రాయిడ్ చెప్పాడు. మోహనిద్ర ద్వారా అణచి వేసిన కోరికలను బయటకు తెచ్చి, చికిత్స చేయవచ్చుని కూడా ఫ్రాయిడ్ పేర్కొన్నాడు. ఇందులో లైంగిక పాళ్ళు అధికంగా చూపాడు కూడా. ఫ్రాయిడ్ విధానం వైద్య రంగంలో మనోవిశ్లేషణగా పాతుకపోయి, అనేక మార్పులు తెచ్చింది. తొలుత ఫ్రాయిడ్ అనుచరులుగా ఆరంభించిన ఏడ్లర్, యూంగ్‌లు క్రమేణా విభేదించి, వేరే పద్ధతులు అనుసరించారు. ఫ్రాయిడ్ సెక్స్‌కు యిచ్చిన ప్రాధాన్యతను కాదని, ఏడ్లర్, మనిషిలో అధికార శక్తి అతడిని నడిపిస్తుందన్నాడు. తాను తక్కువ అనే లోపాన్ని పోగొట్టుకోడానికి చిన్నతనం నుండే పెద్దయ్యే వరకు వ్యక్తి అనేక విధాల ప్రయత్నిస్తున్నట్లు ఏడ్లర్ చూపాడు. ఇలా చేయలేని వ్యక్తి మానసిక రుగ్మతలకు గురౌతాడన్న మాట. ఆ విషయాలు విడమరచి చికిత్స చేయడాన్ని ఏడ్లర్ స్కూలు అనుసరించింది. వీరిద్దరికీ భిన్నంగా యూంగ్ విశ్లేషణాత్మక సైకాలజీ పెంపొందించారు. ఫ్రాయిడ్ పేర్కొన్న సెక్స్ బదులు, జీవన శక్తికి యూంగ్ ప్రాధాన్యత ఇచ్చాడు. మనుషుల్ని బాహ్య, అంతర్ముఖులుగా ఆయన వర్గీకరించారు. అణచివేసిన వాటిలో కేవలం తీరని కోర్కెలే గాక, గర్భిత ప్రతిభలు ఇంకా వున్నాయన్నాడు. ఇందులో సమష్టి మనస్తత్వానికి యూంగ్ చాలా ప్రాముఖ్యత యిచ్చాడు. ఈ దశలో యూంగ్, దయ్యాలు, భూతాలు, దైవాలు, ప్రకృతి శక్తులు, పునర్జన్మలు యిత్యాదులన్నీ పేర్కొన్నాడు. అయితే యూంగ్ చెప్పేవి చాలామటుకు శాస్త్రీయ పరిశోధనలకు నిలువలేదు. అతీంద్రియ శక్తులు, జ్యోతిష్యం వంటివి యూంగ్ పేర్కొని జనాకర్షణ పొందినా, అవి రుజువుకు నిలవలేక, క్షీణించాయి.

ప్రస్తుతం సంజీవదేవ్‌గారి వర్గీకరణ కుదిరేటట్లు లేదు. సైకాలజీలో స్కూల్సు తగ్గుముఖం పట్టగా, అన్ని స్కూల్సు చెప్పిన వాటిల్లో నిలిచేవి ఏరి స్వీకరిస్తున్నారు. సత్వ, రజో, తమో గుణాలుగా

సంజీవదేవ్ వర్గీకరించినవి ఆయనే మళ్లీ రాస్తే, మార్చేస్తారనుకుంటాను. కాని ఆధునిక సైకాలజీ విషయాలు అవలీలగా సంజీవదేవ్ చెప్పడం వారి మానసిక స్పష్టతకు గీటురాయి.

## అతీంద్రియ విజ్ఞానం

పరా మనోవిజ్ఞానం పేరిట కొంత ప్రచారం, మరికొంత నమ్మకం, ఇంకొంత పరిశోధన జరిగింది. సంజీవదేవ్ యీ రంగాన్ని కూడా ప్రస్తావించారు. ఆరో ఇంద్రియ శక్తి వున్నట్లు ఆయన గట్టిగా నమ్మాడనజాలం. కాని అలాగని నిర్ధారణగా తృణీకరించనూ లేదు. సైకాలజీ పరిశోధన శాస్త్రీయంగా చేసి, గౌరవం ఆపాదించే ప్రయత్నం 1927 నుండి డా. జె.బి. రైన్ ఆధ్వర్యాన అమెరికాలోని డ్యూక్ యూనివర్సిటీలో మొదలైంది. ఇంద్రియాతీయ జ్ఞానం కచ్చితంగా కనుగొన్నట్లు 1940 నాటికి చెబుతూ ప్రచారం చేశారు. శాస్త్రీయ పరిశోధనలో ఒకసారి రుజువైతే, ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ అలాంటి పరిశోధన జరిపినా అలాంటి ఫలితాలు వస్తాయి. 1965లో రైన్ రిటైర్ అయ్యే నాటికి అతీంద్రియ శక్తులపై శాస్త్రీయాధారాలు లభించలేదు. సోవియట్ యూనియన్‌లో జరిగిన పరిశోధనలకు సైతం ఆధారాలు, రుజువులు రాలేదు. కనుక యీ విషయం యింకా గాలిలోనే వున్నదని చెప్పాలి.

విజ్ఞానం తనకు అన్నీ తెలుసు అనడం లేదు. సంపూర్ణత సాధించాననలేదు. తెలిసినంతవరకు నిర్ధారణగా పేర్కొని, తెలియని దానిని పరిశోధిస్తున్నది. తెలియని రంగంలో నిర్ధారణగా చెబుతున్నది మతం, నమ్మకాలు, జ్యోతిష్యం వగైరాలు.

తెలుసుకోవడం ఇంద్రియాల ద్వారా మెదడుకు చేరే అంశాలపైనే ఆధారపడి వుంటుంది. ఒకసారి మెదడులో రికార్డు అయిన తరువాత, భావాలకు, స్వతంత్ర ప్రతిపత్తి ఏర్పడుతుంది. ఆ భావాల ఆధారంగా కొత్త ఆలోచనలు చేయడం సాధ్యమే. జ్ఞానార్జన విషయమై సైన్స్ పేర్కొంటున్న యీ విషయాలను సంజీవదేవ్ చక్కగా విడమరచారు. (బయోసింఫనీ 103)

## సంజీవదేవ్ మానవత

సంజీవదేవ్ తన రచనలన్నింటిలో మానవుడు కేంద్రంగానే ఆలోచనలు సాగించారు. మానవతకు అడుగడుగునా ప్రాధాన్యత యిచ్చారు. అయితే వివేచన ఒకవైపు వికసిస్తుండగా, రామణీయకతపై శీతకన్ను పడినట్లు ఆయన భావించారు. కనుక రమణీయతను కలుపుక పోయి, అలాంటి మానవతను మనో (వికాస) మానవత అందాం ఒంటున్నారు. బహుశ యీ విషయంలో ఆయనతో వివాదం వుండే ఆస్కారం లేదేమో!

కొన్ని మాటలకు విపరీతార్థాలు రూఢిగా వచ్చాయి. అందులో "సూపర్" అని తగిలించడం ఒకటి. మన పూర్వీకుల గురించి, ముఖ్యంగా రుషులు, యోగుల గురించి ఆధారాల కంటె, నమ్మకాలు, గాథలే ఎక్కువగా ప్రచారంలో వున్నాయి. మన యోగులు ప్రత్యేక మానసిక శక్తులు ప్రదర్శించినట్లు న్యూరాలజిస్టులు ప్రస్తావించారని సంజీవదేవ్ రాశారు. ఇందుకు అట్టే నిదర్శనలు

లభించడం లేదు. కాని సాధారణ మానవు లకు భిన్నంగా విపరీత మేధస్సు లక్షణా లకు వివిధ రంగాలలో వివిధ కాలాలలో చూపిన, చూపుతున్న వారున్నారు. అవి కూడా మానవశక్తులే గాని, మానవాతీ తాలు కావు గదా. ఇందుకు ఎన్నో ఉదాహ రణలు ఉన్నాయి.

రామణీయకతకు ప్రాధాన్యత యిచ్చి మానవతకు పరిపుష్టి చేకూర్చాలని సంజీవ దేవ్ ఉద్దేశించినప్పుడు ఒకే ఒక జాగ్రత్త వహించాలేమో ననిపిస్తున్నది. ఇన్నా ళ్ళుగా కళలు, రామణీయకతారంగ మంతా దైవ ప్రాధాన్యతతో, మతప్రాతిపది కలతో సాగింది. అవి లేకుండా రామణీయ కత లేదనేటంతవరకూ తీసుకెళ్ళారు. వాస్తవానికి అన్ని కళల్ని మతం, దైవం పేరిట భ్రష్టు పట్టించారు. మనిషి మానసి కంగా బానిస గావడానికి కళల్ని ప్రయో గించారు. ఈ ప్రభావం నుండి బయట పడడానికి కూడా సంజీవదేవ్ సూచించిన ప్రత్యామ్నాయ పద్ధతి అనుసరణీయం. మానవ విలువలతో కూడిన కళలు, రామ ణీయకత నేటి అవసరం కూడా.

సంజీవదేవ్‌ను ఎవరితోనూ పోల్చదల చలేదు. కాని ఆయన రచనలు పరిశీలిం చిన తరువాత, రామణీయకత, కళలు, మనోవిజ్ఞానం, వ్యక్తుల అంచనా, అనుభ వాలు, జ్ఞాపకాలు అవలీలగా అవగాహన చేసుకుని మనకు మంచినీళ్ళ ప్రాయంగా అందించడంలో ఎరిక్ ఫ్రాంతో సంజీవదె వ్‌ను పోల్చడం ఔచిత్యంగా వుంటుందని పిస్తున్నది. తెలుగులో సంజీవదేవ్ చెప్పిన చాలా విషయాలు ఇందుకు నిదర్శనలు.

"ఇహమునందు సుఖము ఇంపార కుండిన
పరమునందు ఎట్లు బడయవచ్చు
మొదలులేని చావ తుదనెట్లు గలుగురా..."

"షడ్రుచులు వేరు ధరలో సారమొకటె
సకల మతములు వేర్వేరు సాధ్యఁడొకఁడె
భక్తులు గనఁగ వేరైన బ్రాప్యుఁ డొకఁడె
కువలయంబున దీనిఁ గైకొనుము వేమ."

MISIMI/మిసిమి RNI Regd No.45042/90 Telugu Monthly Hyderabad-500 020

Postal Regd. No.H/SD/191

Phone: 67148/66909.
Grams: CARDI CAP.
Telex: 0425-2043 NAAP IN

AN ADVANCED

TECHNOLOGY

FOR AN IMPROVED

QUALITY OF LIFE

NATCO

NATCO FINE PHARMACEUTICALS PVT. LTD.
Regd off: 1-10/12, Ashoknagar, Hyderabad-500 020.

Printed, Published and Edited by Shri ALAPATI RAVINDRANATH for and at Kala Jyothi Process Pvt.Ltd.
1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyderabad-500 020.